మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU

దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 4-4-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 275 Issue: 275

04 ఏప్రిల్ 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - వసంత ఋతువు చైత్ర మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:12 సూర్యాస్తమయం - సా. 6:26 తిథి విదియ ఉ. 10:10 వరకు తరువాత తదియ సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం స్వాతి రా. 9:32 వరకు తరువాత విశాఖ యోగం హర్షణ మ. 2:14 వరకు కరణం గరజి ఉ. 10:10 వరకు వనిజ రా. 11:04 వరకు వర్జ్యం తె. 3:46 నుండి తె. 5:32 వరకు దుర్ముహూర్తం ఉ. 7:50 నుండి ఉ. 8:39 వరకు రాహుకాలం ఉ. 9:15 నుండి ఉ. 10:47 వరకు యమగండం మ. 1:51 నుండి మ. 3:22 వరకు గుళికాకాలం ఉ. 6:12 నుండి ఉ. 7:43 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:36 నుండి తె. 5:24 వరకు అమృత ఘడియలు ఉ. 11:58 నుండి మ. 1:43 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:54 నుండి మ. 12:43 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
Circulated to Telangana



## అమెరికా యుద్ధ విమానాలు నేలమట్టం!

### ఎఫ్ 35, ఎఫ్ 15ఈను కూల్చేసిన ఇరాన్?

### అమెరికా రక్షణ వ్యవస్థకు బిక్ షాక్

టెహ్రాన్: యుద్ధంలో అమెరికాకు బిగ్ షాక్ తగిలింది. అమెరికా ఫైటర్ జెట్లను ఇరాన్ ఒక్కొక్కటిగా నేలమట్టం చేస్తోంది. నైరుతి ఇరాన్ ప్రాంతంలో అమెరికాకు చెందిన అత్యాధునిక యుద్ధ విమానాన్ని కూల్చివేసినట్లు ఇరాన్ మీడియా ప్రకటించింది. కూలిన విమానం నుంచి పైలట్ పారాచూట్ సహాయంతో కిందకు దూకినట్లు వార్తలు వస్తున్నాయి. అతడిని పట్టుకునేందుకు



## సీఎన్జీ 'బెంగ'ళూరు

### .......కిలోమీటర్ల పొడవున క్యూ

బెంగళూరు: బెంగళూరులో ప్రస్తుతం ఆటో డ్రైవర్లు సీఎన్జీ, ఆటో ఎల్పీజీ కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత కొద్ది రోజులుగా ఇంధన సరఫరాలో అంతరాయం కలగడంతో శుక్రవారం బంకుల వద్ద భారీ క్యూలు కనిపించాయి. అనేక సీఎన్జీ స్టేషన్లకు గ్యాస్ అందడం లేదు. నగరంలోని పరిమిత సంఖ్యలో ఉన్న సీఎన్జీ బంకుల వద్ద ఆటోలు, క్యాబ్‌లు కిలోమీటర్ల మేర బారులు తీరుతున్నాయి. ఇంధనం కోసం డ్రైవర్లు దాదాపు 8 నుండి 10 గంటల పాటు వేచి ఉండాల్సి వచ్చింది. కొరత వల్ల గతంలో కిలో రూ.64గా ఉన్న సీఎన్జీ ధర ప్రస్తుతం రూ.80 నుంచి రూ.90 వరకు పెరిగినట్లు డ్రైవర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, గంటల తరబడి క్యూలలో ఉండటం వల్ల రోజువారీ ఆదాయం గణనీయంగా పడిపోయిందని నిట్టూరుస్తున్నారు. గ్యాస్ దొరకక చాలా మంది ఆటోలను పక్కన పెట్టేశారని వెల్లడించారు.

## 36 గంటలు 'మీ సేవ' బంద్

### సోమవారం నుంచి అందుబాటులో

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఈవార్తలు): కొత్త సాఫ్ట్‌వేర్‌ను అప్ లోడ్ చేయడంలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మీ సేవ కేంద్రాల్లో శుక్రవారం రాత్రి నుంచి అన్ని రకాల సేవలు నిలిచిపోయాయి. దీంతో వివిధ పనుల కోసం మీ సేవ కేంద్రాలకు వెళ్లేవారికి సేవలు అందుబాటులో ఉండవని మీసేవ నిర్వాహకులు తెలిపారు. షెడ్యూల్డ్ మెయింటెనెన్స్ కారణంగా, మీ సేవ కేంద్రాల ద్వారా అందుతున్న అన్ని రకాల సేవలకు తాత్కాలికంగా బ్రేక్ పడుతుందని పేర్కొన్నారు. కొత్త -2 వ పేజీలో...

## కారు కన్ఫర్మ్!?

### 7న కేటీఆర్‌తో జీవన్ రెడ్డి భేటీ?

### 13న బీఆర్ఎస్‌లో జాయినింగ్!

### స్వయంగా ఆహ్వానించనున్న కేటీఆర్

### ఆ తర్వాత జగిత్యాలలోనే ప్లీనరీ

కాంగ్రెస్ మాజీ సీనియర్ నేత జీవన్ రెడ్డి బీఆర్ఎస్ గూటికి చేరేందుకు తేదీ కూడా ఫిక్స్ అయినట్లు సమాచారం. గత నెల 25వ తేదీన కాంగ్రెస్ పార్టీకి జీవన్ రెడ్డి రాజీనామా చేసిన ఆయన.. ఈ నెల 13న గులాబీ కండువా కప్పుకోనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జీవన్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనను అధికారికంగా ఆహ్వానిస్తారని తెలుస్తోంది. జీవన్ రెడ్డిని బీఆర్ఎస్ లోకి చేర్చుకున్నాక ప్లీనరీని జగిత్యాలలో ఏర్పాటు చేయాలని బీఆర్ఎస్ యోచిస్తున్నట్లు సమాచారం.



జగిత్యాల బ్యూరో, ఏప్రిల్ 3 (ఈవార్తలు): జీవన్ రెడ్డిలాంటి సీనియర్, నిఖార్సైన, నిబద్ధత కలిగిన సీనియర్ నేతలు పార్టీలోకి వస్తే క్యాడర్ మరింత పటిష్టంగా, రెట్టింపు జోష్‌తో ముందుకు వెళ్లవచ్చని బీఆర్ఎస్ పావులు కదుపుతోంది. మొత్తంగా ఈ నెల 7న కేటీఆర్ భేటీ తర్వాత దీనిపై అధికారిక ప్రకటన వెలువడుతుందని తెలుస్తోంది.

### రేవంత్ పాలనపై ప్రజల్లో అసంతృప్తి: జీవన్ రెడ్డి

రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన ప్రారంభమై రెండేళ్లు కాకముందే 'ఈ ప్రభుత్వం పోవాలి.. మార్పు రావాలి' అనే పరిస్థితి ఏర్పడిందని జీవన్ రెడ్డి విమర్శించారు. గతంలో కేసీఆర్ పాలనపై వ్యతిరేకతతోనే ప్రజలు కాంగ్రెస్‌కు ఓటేశారని, కానీ ఇప్పుడు అదే తరువాయి 2 వ పేజీలో...



## లడ్డూల్లేవ్!

### కొండగట్టులో లడ్డూల కొరత

### ఆలయ సిబ్బందిపై భక్తుల ఆగ్రహం

జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో సరైన ఏర్పాట్లు కల్పించడంలో అధికారుల విఫలమయ్యారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే హనుమాన్ విజయోత్సవం (చిన్న జయంతి) ఒక రోజు ముందు చలువ పందిళ్లు కూలిపోయింది. ఈ ఘటనలో అనేక మంది తీవ్రంగా గాయాలపాలయ్యారు.

## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,093 |
| వెండి (గ్రాము): | రూ.255 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,966 |

## సిద్దిపేట.. లేదంటే గజ్వేల్!

### నిజామాబాద్‌లోనూ పోటీ చాన్స్

### టీఆర్ఎస్ పేరుతో పార్టీ పెడతా

### జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత



హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఈవార్తలు): మహిళా రిజర్వేషన్లు వస్తే సిద్దిపేట లేదా గజ్వేల్ నుంచి పోటీ చేసే ఆలోచనలో ఉన్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. నిజామాబాద్‌లో కూడా చాలా సీట్లు మహిళా కోటాలోకి వస్తాయన్నారు. డీఎస్పీ విశారదన్ మహరాజ్ గారితో కలిసి ముందుకు సాగుతామని వెల్లడించారు. బీఆర్ఎస్ చీఫ్ కేసీఆర్ కష్టపడి టీఆర్ఎస్‌ను అధికారంలోకి తెచ్చారని,అదే స్ఫూర్తితో తాను జాగృతి కోసం కష్టపడుతున్నాని వెల్లడించారు. హార్డ్ వర్క్‌లో చంద్రబాబు సూపర్, టీడీపీకి బలమైన పార్టీ నిర్మాణం ఉందని ఆమె తరువాయి 2 వ పేజీలో...




## కాంగ్రెస్‌కు ధర్మపురి సంజయ్ గుడ్‌బై!

నిజామాబాద్‌లో కాంగ్రెస్ పార్టీకి భారీ షాక్ తగిలే అవకాశం ఉంది. నిజామాబాద్ మాజీ మేయర్, డీ శ్రీనివాస్ తనయుడు ధర్మపురి సంజయ్ కాంగ్రెస్ పార్టీకి రాజీనామా చేయనున్నట్లు సమాచారం. ఎంత కష్టపడ్డా కూడా పార్టీలో గుర్తింపు లేదని తన అనుచరులతో ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

నిజామాబాద్, ఏప్రిల్ 3 (ఈవార్తలు): పార్టీ విధానాల వల్ల ఉన్న అసంతృప్తి, కార్యకర్తల ఒత్తిడి మేరకు ఆయన పార్టీకి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. రేపోమాపో తన అనుచరులు, కార్యకర్తలతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణపై చర్చించే అవకాశం ఉంది. అనంతరం తుది నిర్ణయాన్ని ప్రకటించనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. పార్టీ అనుసరిస్తున్న కొన్ని విధానాలు, స్థానిక నాయకత్వంతో ఉన్న విభేదాలు తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



భూమికి చెందిన అద్భుతమైన చిత్రాన్ని నాసా విడుదల చేసింది. చంద్రుడి వైపు ప్రయాణిస్తున్న ఆర్టెమిస్-2 వ్యోమగాములు, తమ ఒరియన్ క్యాప్సూల్ కిటికీ నుంచి ఈ హై-రిజల్యూషన్ ఫొటోను చిత్రీకరించారు. ఈ ఫొటోలో భూగోళం మొత్తం నీలి, గోధుమ రంగులతో ప్రకాశవంతంగా కనిపిస్తోంది. వాతావరణంలో ఏర్పడిన ఆకుపచ్చని అరోరా కూడా ఈ చిత్రంలో స్పష్టంగా కనువిందు చేస్తోంది.

## ఒకే పెళ్లి.. ఒకే చట్టం!



### త్వరలో యూసీసీ అమలు

### సివిల్ కోడ్‌పై అమిత్ షా

గౌహతి: అస్సాం అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో బీజేపీ అగ్ర నేత, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొన్నారు. గోల్‌పాడా జిల్లాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో కీలక వ్యాఖ్యలు చేశారు. చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోకుండా ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) ద్వారా అడ్డుకునే వీలు ఉంటుందన్నారు. 'ఆదివాసీల అభివృద్ధి కోసం ప్రధాని మోదీ, అస్సాం ముఖ్యమంత్రి రోడ్ మ్యాప్ సిద్ధం చేశారు. మోదీ నాయకత్వంలో ఆదివాసీ మహిళ దేశ ప్రథమ పౌరురాలు అయ్యారు' అని పేర్కొన్నారు. గిరిజన తరువాయి 2 వ పేజీలో...

## అన్నామలైకి నో టికెట్



### బీజేపీ సంచలన నిర్ణయం

అసెంబ్లీ ఎన్నికల వేళ తమిళనాడు రాజకీయాల్లో అనూహ్య పరిణామం చోటు చేసుకుంది. తమిళనాడు బీజేపీ మాజీ చీఫ్ అన్నామలైకు పార్టీ హైకమాండ్ షాకిచ్చింది. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆయనకు టికెట్ నిరాకరించింది. అయితే, ఎన్నికల్లో పోటీ చేసేందుకు అన్నామలై నిరాకరించాడా లేక అధిష్టానమే టికెట్ ఇవ్వలేదా అన్న విషయంపై స్పష్టత లేదు.

చెన్నై: ఏదేమైనప్పటికీ రాష్ట్రంలో కీలక నేత అయిన అన్నామలైకు బీజేపీ టికెట్ నిరాకరించడం రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఈ నెల 23న జరగనున్న తమిళనాడు తరువాయి 2 వ పేజీలో...



## మూడ్రోజులు వానలు

### ఈదురుగాలులు వీచే చాన్స్

### వాతావరణ కేంద్రం వెల్లడి

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఈవార్తలు): రాష్ట్రంలో రానున్న మూడు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని, రాళ్ల వాన పడే చాన్స్ తరువాయి 2 వ పేజీలో...

# ..విమానాలు నేలమట్టం!

**మొదటి పేజీ తరువాయి**

ఇరాన్ సైన్యం, పౌరులు రంగంలోకి దిగారు. అమెరికా పైలట్‌ని ప్రాణాలతో పట్టుకోవాలని ఇరాన్ సర్కార్ ఆదేశించింది. ఇరాన్ ప్రభుత్వ అధికారిక ఛానెల్ ఐఆర్ఐబి ఈ ఘటనపై ప్రత్యేక కథనాలను ప్రసారం చేస్తోంది. 'శత్రు పైలట్‌ను సజీవంగా పట్టుకుని పోలీసులకు లేదా సైన్యానికి అప్పగిస్తే విలువైన బహుమతి అందజేస్తాం' అని ప్రకటించారు. పైలట్‌ను వెతకడానికి వందల మంది పౌరులు తమ ప్రైవేట్ వాహనాల్లో ఘటనా స్థలానికి చేరుకుంటున్నట్లు సమాచారం. అయితే, పైలట్‌ను ఎవరూ హింసించవద్దని ఇరాన్ సాయుధ దళాలు ప్రజలకు విజ్ఞప్తి చేశాయి. ఇరాన్ మీడియా కథనాల ప్రకారం, గత 24 గంటల్లో అమెరికాకు చెందిన రెండు రకాల శక్తివంతమైన విమానాలు కుప్పకూలాయి. మధ్య ఇరాన్ పైన ఎగురుతున్న ఎఫ్-35 స్టెల్త్ ఫైటర్ జెట్‌ను ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ కూల్చివేసినట్లు తస్నిమ్ వార్తా సంస్థ పేర్కొంది. దీనికి సంబంధించిన శకలాల చిత్రాలను కూడా విడుదల చేసింది. అలాగే మరో ఎఫ్-15ఈ స్ట్రైక్ ఈగిల్ యుద్ధ విమానాన్ని కూడా పేల్చేశామని తెలిపింది బ్రిటన్‌లోని ఆర్ఏఎఫ్ లేకెన్‌హీత్ నుంచి వచ్చిన ఈ విమానాన్ని కూడా కూల్చివేశామని, విమానం తోక భాగం శకలాలు దీనిని ధృవీకరిస్తున్నాయని ఇరాన్ వెల్లడించింది.

**అమెరికా వెర్షన్ ఇదీ..**

ఇరాన్ చెప్తున్నట్లు ఎఫ్ 35 యుద్ధవిమానం క్షేమమేనని, ఎఫ్-15ఈ యుద్ధ విమానం మాత్రం కూలిపోయిందని అమెరికా వివరణ ఇచ్చింది. ఒక పైలట్‌ను ఇరాన్ బలగాల నుంచి రక్షించామని వెల్లడించింది. ఫిబ్రవరి 28న ఘర్షణలు ప్రారంభమైనప్పటి నుండి ఎఫ్-35ని కూల్చామని ఇరాన్ ప్రకటించడం ఇది మూడవసారి కావడం గమనార్హం.



## యుద్ధానికి అమెరికా ఖర్చు రోజుకు 16,600 కోట్లు

ఇరాన్‌తో యుద్ధం, పెరుగుతున్న ప్రపంచ భద్రతకు ముప్పు వంటి ఖర్చుల నేపథ్యంలో 2027 ఏడాదికి 1.5 ట్రిలియన్ డాలర్ల (భారత కరెన్సీలో దాదాపు 14 లక్షల కోట్లు) భారీ రక్షణ బడ్జెట్‌ను ఆమోదించాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శుక్రవారం చట్టసభ సభ్యులను కోరారు. వాషింగ్టన్ సైనిక కార్యకలాపాల కొనసాగింపు, తగ్గిన ఆయుధ నిల్వలు పెంచుకోడానికి ప్రయత్నిస్తున్నందున ఏడాదిలోనే పెంటగాన్ వ్యయాన్ని 40 శాతానికి పైగా పెంచడం విశేషం. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అమెరికా రక్షణ బడ్జెట్ ఇంత భారీగా పెరగడం ఇదే మొదటిసారి. ప్రస్తుత సంఘర్షణతో పెరుగుతున్న ఆర్థిక ఒత్తిడిని ఈ ప్రతిపాదన వెల్లడించింది. సైనిక వ్యయంలో ఈ భారీ మొత్తం నిధులు ఎలా సమకూర్చాలనే దానిపై కాంగ్రెస్‌లో ఒక రాజకీయ పోరాటానికి రంగం సిద్ధమవుతోంది. ప్రస్తుతం పశ్చిమాసియాలో ఇరాన్ యుద్ధానికి రోజుకు 2 బిలియన్ డాలర్ల (రూ.16,600 కోట్లు) వరకు ఖర్చవుతుందని, ఇది ఖజానాపై పడుతున్న భారాన్ని నొక్కి చెబుతోందని అమెరికా మీడియా రహస్య కాంగ్రెస్ సమావేశాలను ఉటంకిస్తూ నివేదించింది. ఇరాన్‌తో యుద్ధం ప్రారంభమైన మొదటి వారంలోనే అమెరికా 11.3 మిలియన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.లక్ష కోట్లు ఖర్చుపెట్టింది. వైట్ హౌస్ నివేదికల ప్రకారం.. ఇరాన్‌లో కొనసాగుతున్న సైనిక చర్యకు ఖర్చులు, క్షిపణులు, ఇతర ఆయుధ సంపత్తిని సమకూర్చుకోవడం,చైనా వంటి ఇతర దేశాల నుంచి పొంచి ఉన్న ముప్పును ఎదుర్కోవడానికి సైన్యాన్ని మరింత శక్తివంతం చేయడం కోసం నిధులను ప్రతిపాదించారు. అయితే, రక్షణ బడ్జెట్ కోసం నిధులను సర్దుబాటు చేయడానికి వైద్యం, ఆరోగ్య సంరక్షణ వంటి సామాజిక సంక్షేమ పథకాలకు బడ్జెట్‌లో 73 బిలియన్ డాలర్ల మేర కోత విధించాలని ట్రంప్ యంత్రాంగం ప్రతిపాదించడం గమనార్హం. ఈ ప్రతిపాదనను విపక్ష డెమొక్రాట్లు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. సామాన్య ప్రజల అవసరాల కంటే యుద్ధానికే ప్రాధాన్యత ఇస్తున్నారని దుయ్యబడుతున్నారు. కానీ, ట్రంప్ మాత్రం యుద్ధ సమయంలో రక్షణకే పూర్తి ప్రాధాన్యత ఇవ్వాలని, వైద్యం, ఆరోగ్య సంరక్షణ పూర్తిగా ప్రభుత్వం నిర్వహించడం సాధ్యం కాదని అంటున్నారు. సంక్షిప్త రూపంలో విడుదల చేసిన ఈ బడ్జెట్ ప్రతిపాదనను తిరస్కరించడం లేదా సవరించే అధికారం చట్టసభ సభ్యులకు ఉంటుంది. రక్షణ బడ్జెట్‌లో అధిక భాగాన్ని 1.1 ట్రిలియన్ డాలర్లకపైగా ప్రామాణిక కేటాయింపుల ప్రక్రియ ద్వారా ఆమోదించాలని కాంగ్రెస్‌ను కోరుతున్నారు. అదే సమయంలో డెమొక్రాట్ల మద్దతు అవసరం లేకుండా పార్టీ-లైన్ యంత్రాంగాన్ని ఉపయోగించి మరో 350 బిలియన్లను ఆమోదించాలని ప్రయత్నిస్తున్నారు. దీనికి రిపబ్లికన్‌ల నుంచి సుముఖత వ్యక్తమవుతున్నట్టు తెలుస్తోంది.



# అన్నామలైకి నో టికెట్

**మొదటి పేజీ తరువాయి**

అసెంబ్లీ ఎన్నికల కోసం బీజేపీ శుక్రవారం 27 మందితో అభ్యర్థులను ప్రకటించింది. ఈ జాబితాలో పలువురు ప్రముఖుల పేర్లు ఉన్నాయి. తెలంగాణ మాజీ గవర్నర్ తమిళిసై మైలాపూర్ నుంచి బరిలోకి దిగుతున్నారు. తమిళనాడు బీజేపీ చీఫ్ నైనార్ నాగేంద్రన్ సత్తూరు నుంచి పోటీ చేయనున్నారు. అవనాశి స్థానం నుంచి కేంద్ర మంత్రి ఎల్. మురుగన్, బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు వనతి శ్రీనివాసన్ కోయంబత్తూరు (ఉత్తర) నుంచి పోటీ బరిలోకి దిగనున్నారు. అయితే, ఈ జాబితాలో తమిళనాడు బీజేపీ మాజీ చీఫ్ అన్నామలై పేరు లేకపోవడం గమనార్హం. తమిళనాడులో బీజేపీ ప్రతిపక్ష అన్నాడీఎంకేతో పొత్తు పెట్టుకుంది. పొత్తులో భాగంగా బీజేపీకి 27 సీట్లు దక్కాయి. సీట్ల షేరింగ్, బీజేపీకి కేటాయించిన స్థానాలపై అన్నామలై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. బీజేపీకి బలం లేని స్థానాలు కేటాయించారని.. ఈ మేరకు పార్టీ హైకమాండ్‌కు లేఖ రాశారు. కానీ బీజేపీ అధిష్టానం ఈ విషయాన్ని లైట్ తీసుకున్నట్లు సమాచారం. దీంతో అసంతృప్తికి గురైన అన్నామలై అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయడం లేదని టాక్. అంతేకాకుండా ప్రచార బాధ్యతలకు కూడా దూరంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే తనకు కేటాయించిన ఆరు నియోజవర్గాల ప్రచార బాధ్యతల నుంచి వైదొలిగినట్లు తెలుస్తోంది.

# లడ్డూల్లేవ్!

### కొండగట్టులో లడ్డూల కొరత.. ఆలయ సిబ్బందిపై భక్తుల ఆగ్రహం

మల్యాల, ఏప్రిల్ 3 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో సరైన ఏర్పాట్లు కల్పించడంలో అధికారుల విఫలమయ్యారని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే హనుమాన్ విజయోత్సవం (చిన్న జయంతి) ఒక రోజు ముందు చలువ పందిళ్లు కూలిపోయింది. ఈ ఘటనలో అనేక మంది తీవ్రంగా గాయాలపాలయ్యారు. మరోవైపు ఈ ఘటన తర్వాత కూడా అధికారులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవడంలో విఫలమయ్యారు. ముఖ్యంగా తాగునీరు, ప్రసాదాలు కూడా దొరకని పరిస్థితి ఏర్పడిందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గంటల తరబడి క్యూలైన్ లలో నిల్చొని ఉన్న, ప్రసాదాలు లభించడంలేదని వాపోయారు. ప్రసాదాలు అడిగితే సిబ్బంది దురుసుగా ప్రవర్తిస్తున్నారని భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. హనుమాన్ జయంతి నేపథ్యంలో భారీగా భక్తులు వస్తారని తెలిసి కూడా ప్రసాదాల కొరత ఏర్పడటం ఏంటని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికారుల ముందు చూపు ఎంత దయనీయంగా ఉందో ఈ పరిస్థితి అద్దం పడుతోందని మండిపడ్డారు.

# కారు కన్ఫర్మ్!?

**మొదటి పేజీ తరువాయి**




తరహా అసంతృప్తి రేవంత్ ప్రభుత్వంపై కనిపిస్తోందని పేర్కొన్నారు. తన రాజకీ య ఎదుగుదలను అడ్డుకునేందుకే నామినేటెడ్ పదవుల భర్తీలో జాప్యం చేశారని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కేవలం రాజకీయ విమర్శలే తప్ప, పున రుద్ధరణ పనులపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదని మండిపడ్డారు. మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల బరాజ్‌ల పునరుద్ధరణకు కేవలం రూ.500 కోట్లు ఖర్చవు తాయని, కానీ ప్రభుత్వం ఎన్డీఎస్ఏ నివేదికను కూడా అమలు చేయడం లేదని విమర్శించారు. ప్రాణహిత జలాల వినియోగంలో ప్రభుత్వం విఫలమైందని, బడ్జెట్ లో కేవలం రూ.152 కోట్లు కేటాయించడం నిర్లక్ష్యానికి పరాకాష్ఠ అని ధ్వజ మెత్తారు. మేడిగడ్డ పునరుద్ధరణ చేపట్టకపోతే 18 లక్షల ఎకరాల సాగుభూమి ఎడా రిగా మారుతుందని, హైదరాబాద్ తాగునీటి అవసరాలకు కూడా ముప్పు వాటిల్లు తుందని హెచ్చరించారు. భవిష్యత్ రాజకీయ నిర్ణయాలపై స్పందిస్తూ, త్వరలోనే ఒక నిర్ణయం తీసుకుంటానని జీవన్ రెడ్డి తెలిపారు. తనపై బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు చూపుతున్న అభిమానానికి కృతజ్ఞతలు తెలిపిన ఆయన... మరో రెండు వారాల్లో ఏ పార్టీలో చేరబోతున్నానో అధికారికంగా ప్రకటిస్తానని స్పష్టం చేశారు.

## రాశి ఫలాలు



4.4.2026

మేషం: ఆర్థికంగా గందరగోళ పరిస్థితులు ఉంటాయి. నూతన ఋణాలు చేయవలసి వస్తుంది. దూర ప్రయాణ సూచనలు ఉన్నవి. కుటుంబ సభ్యుల ప్రవర్తన నిరాశ కలిగిస్తుంది. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలలో అవరోధాలు కలుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిదానంగా సాగుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

వృషభం: భాగస్తులతో మాటపట్టింపులు ఉంటాయి. వృత్తి ఉద్యోగాలలో అదనపు బాధ్యతల వలన శ్రమాధిక్యత పెరుగుతుంది. చిన్ననాటి మిత్రులతో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఆర్థిక వ్యవహారాలు నిరుత్సాహపరుస్తాయి. నూతన వాహన కొనుగోలు ప్రయత్నాలు వాయిదా వేస్తారు. సంతానం విద్యా విషయాలపై దృష్టి సారించడం మంచిది.

మిధునం: చిన్ననాటి మిత్రుల నుండి ఆసక్తికర సమాచారం అందుతుంది. అవసరానికి ధనం చేతికి అందుతుంది. వ్యాపార ఉద్యోగాలలో స్వంత నిర్ణయాలు కలసివస్తాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. విలువైన గృహోపకరణాలు కొనుగోలు చేస్తారు. బంధు మిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు.

కర్కాటకం: ఒక ముఖ్య విషయమై మిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. వృత్తి వ్యాపారాలు నిదానంగా సాగుతాయి. ఆర్థిక వ్యవహారాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. చేపట్టిన పనుల్లో జాప్యం కలుగుతుంది. దూర ప్రయాణాలు శ్రమతో కూడినవిగా ఉంటాయి. ఉద్యోగాలలో అధికారులతో జాగ్రత్తగా వ్యవహరించాలి.

సింహం: ఆత్మీయుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. ఆర్థికంగా లాభాలు అందుతాయి. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితం పొందుతారు. ఉద్యోగమున మీ మాటకు విలువ పెరుగుతుంది. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

కన్య: పాత ఋణాల ఒత్తిడితో నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. కుటుంబ వ్యవహారాలలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. చేపట్టిన వ్యవహారాలలో స్వల్ప అవరోధాలు కలుగుతాయి. నూతన వ్యాపార పెట్టుబడులకు చేసే ప్రయత్నాలు మందగిస్తాయి. ప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. ఆధ్యాత్మిక చింతన కలుగుతుంది.

తుల: సంఘంలో విశేషమైన గౌరవ మర్యాదలు పెరుగుతాయి. సోదరుల నుంచి ధన సహాయం అందుతుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. నిరుద్యోగుల ప్రయత్నాలు ఫలించి నూతన అవకాశాలు లభిస్తాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగ వాతావరణం అనుకూలిస్తుంది. ధన ఆదాయం బాగుంటుంది.

వృశ్చికం: దీర్ఘకాలిక ఋణాల నుండి ఉపశమనం కలుగుతుంది. కుటుంబ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది. నూతన వస్త్రాభరణాలు కొనుగోలు చేస్తారు. ధన వ్యవహారాలు కలసివస్తాయి. పాత మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. వృత్తి ఉద్యోగాలలో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. నిరుద్యోగుల కలలు సాకారమౌతాయి.

ధనస్సు: సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. వ్యాపార వ్యవహారాలలో పెద్దల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. దీర్ఘకాలిక ఋణాల ఒత్తిడి అధికమౌతుంది. చేపట్టిన పనులలో అధిక శ్రమతో అల్ప ఫలితం పొందుతారు. ఉద్యోగ వాతావరణం కొంత చికాకు కలిగిస్తుంది. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గోనటం మంచిది.

మకరం: వ్యాపార వ్యవహారాలలో ఆలోచనలు అంతగా కలసిరావు. కుటుంబ సభ్యులతో స్వల్ప వివాదాలుంటాయి. నిరుద్యోగులకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి. చేపట్టిన పనులు మందకొడిగా సాగుతాయి. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలకు ధన సహాయం అందిస్తారు. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

కుంభం: నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. చిన్ననాటి మిత్రులతో దూర ప్రయాణాలు చేస్తారు. సోదరుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాల్లో ఆశించిన పురోగతి సాధిస్తారు. వృత్తి ఉద్యోగాలలో సహోద్యోగులతో సఖ్యత కలుగుతుంది.

మీనం: రాజకీయ వర్గాల వారికీ పదోన్నతులు పెరుగుతాయి. వ్యాపార ఉద్యోగాలలో మరింత ఉత్సాహంగా పనిచేసి లాభాలు అందుకుంటారు. చిన్ననాటి మిత్రులతో వివాదాలు పరిష్కారమౌతాయి. గృహమున నూతన కార్యక్రమాలు ప్రారంభిస్తారు. దూరపు బంధువులతో పాత విషయాలు చర్చిస్తారు. గృహమున శుభకార్య ప్రయత్నాలు ఫలిస్తాయి.

## కాంగ్రెస్‌కు ధర్మపురి సంజయ్ గుడ్‌బై!

**మొదటి పేజీ తరువాయి**

కూడా సంజయ్ రాజీనామా నిర్ణయానికి కారణమని తెలుస్తోంది. తన అనుచరులు, కార్యకర్తలు పార్టీ మారాలని ఒత్తిడి చేయడంతో ఆయన రాజీనామా వైపే మొగ్గు చూపారు. రాజీనామా అంశంపై చర్చించేందుకు ధర్మపురి సంజయ్ హైదరాబాద్‌లో తన ముఖ్య అనుచరులతో అత్యవసర సమావేశం నిర్వహించినట్లు తెలిసింది. త్వరలోనే ఆయన తన రాజీనామా లేఖను అధిష్టానానికి పంపే అవకాశం ఉంది. ఎంపీ ధర్మపురి అర్వింద్ సోదరుడు కావడంతో, ఈ పరిణామం నిజామాబాద్ రాజకీయాల్లో సంచలనంగా మారింది.

## మూడ్రోజులు వానలు

**మొదటి పేజీ తరువాయి**

ఉందని పేర్కొంది. రాష్ట్రంలోని పలు జిల్లాలకు హైదరాబాద్ వాతావరణ కేంద్రం యెల్లో అలర్ట్ జారీ చేసింది. శనివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, జనగామ జిల్లాల్లో వర్షం పడవచ్చని, ఆదివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, జగిత్యాల, సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి, జనగామ జిల్లాల్లో వర్షం కురిసే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

## 36 గంటలు 'మీ సేవ' బంద్

**మొదటి పేజీ తరువాయి**

సాఫ్ట్‌వేర్ అప్డేట్ కావడానికి 36 గంటల సమయం పట్టనుండటం, శనివారంతో పాటు, ఆదివారం సెలవు దినం కావడంతో, మీ సేవలు సోమవారం ఉదయం అందుబాటులోకి రానున్నాయి. తాత్కాలికంగా సేవలు నిలిచిపోతున్నందున, ప్రజలు సహకరించాలని అధికారులు తెలిపారు.

## ఒకే పెళ్లి.. ఒకే చట్టం!

**మొదటి పేజీ తరువాయి**

ప్రాంతాల్లో యూసీసీని బలవంతంగా రుద్దుతారంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారాన్ని ఆయన తిప్పికొట్టారు. ఈ సందర్భంగా ఇటీవల మేఘాలయలో తలెత్తిన ఉద్రిక్తతలను ప్రస్తావించారు. చొరబాటుదారులు అక్కడి ఆదివాసీ మహిళలను వివాహం చేసుకోవడం ద్వారా రాజకీయ పలుకుబడిని సంపాదించడానికి ప్రయత్నించారని, ఇది ఉద్రిక్తతలకు దారితీసిందని ఆయన ఆరోపించారు. తాము అధికారంలోకి వస్తే.. అక్రమ చొరబాట్ల విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని చెప్పారు. 'అస్సాంలో మాకు మరో ఐదేళ్ల సమయం ఇవ్వండి. రాష్ట్రానికి చొరబాటుదారుల నుంచి విముక్తి కల్పించేలా చర్యలు తీసుకుంటాం. అస్సాంలో యూసీసీని అమలు చేస్తాం. దాంతో చొరబాటుదారులు నాలుగు పెళ్లిళ్లు చేసుకోలేరు' అని పేర్కొన్నారు.

# సిద్దిపేట.. లేదంటే గజ్వేల్!

**మొదటి పేజీ తరువాయి**

వెల్లడించారు. తనపై ఉన్న లిక్కర్ కేసు కొట్టేయడంపై స్పందిస్తూ.. ప్రకృతి తనకు సహకరిస్తోందని అన్నారు. ఎంత తెలివైన వాడినైనా అపొచ్చు కానీ, అదృష్టవంతుడిని ఎవరూ ఆపలేరు అంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. త్వరలో పార్టీ పెట్టబోతున్న ఆమె.. శుక్రవారం మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. తమ పార్టీకి తెలంగాణ రాష్ట్ర సమితి అనే పేరు పెడితే ఎలా ఉంటుంది అనే ఆలోచనలో ఉన్నట్లు ఆమె తెలిపారు. అయితే ఈసారి పార్టీ జెండాలో పింక్ కలర్ మాత్రం ఉండదని స్పష్టం చేశారు. పార్టీ ఆవిర్భావం రోజున అమరవీరుల స్థూపాన్ని సందర్శిస్తామని, వేదికపై కేవలం ఉద్యమకారులే ఉంటారని ఆమె స్పష్టం చేశారు. పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ కోసం ఇప్పటికే ఒక ప్రత్యేక టీమ్ రంగంలోకి దిగిందని వెల్లడించారు.ఇక తమ పార్టీలో ప్రొఫెసర్ జయశంకర్ సార్ సిద్ధాంతాలే ప్రాధాన్యమని కవిత చెప్పుకొచ్చారు. తమ ప్రధాన పోరాటం కాంగ్రెస్ పార్టీతోనేని కవిత తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి మహారాష్ట్రలో ప్రచారం కాంగ్రెస్‌ను ఓడించినట్టే, ఇప్పుడు కేరళలో కూడా అదే పని చేస్తారని ఎద్దేవా చేశారు. కేరళలో ఆరు గ్యారంటీల గురించి సీఎం చేసిన వ్యాఖ్యలపై స్పందిస్తూ ఆమె నవ్వుతూ కొట్టిపారేశారు. ఏపీలో అమరావతి ఉన్నా లేకున్నా తమకు అనవసరమన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఫ్యూచర్ సిటీ పేరుతో ఉన్న సిటీని పాడు చేయకుంటే చాలని తెలిపారు. తమ పార్టీ దృష్టి అంతా తెలంగాణ ప్రయోజనాలపైనేనని తేల్చిచెప్పారు.



# ప్రైవేటు ఫీ‘జులుం’ నశించాలి

## ఫీజుల దోపిడీ నుంచి తల్లిదండ్రులను రక్షించాలి.. వెంటనే ఫీజు నియంత్రణ చట్టం తేవాలి

### ఇందుకు అసెంబ్లీ స్పెషల్ సెషన్ నిర్వహించాలి.. తేకపోతే జాగృతి ఆధ్వర్యంలో ఆందోళనలు: కవిత



హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఈవార్తలు): ప్రైవేట్ స్కూల్స్ యాజమాన్యాలు ఒకేసారి 30 శాతం నుంచి 40 శాతం ఫీజులు పెంచి విద్యార్థుల తల్లిదండ్రులను దోపిడీ చేస్తున్నాయని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని ఇందుకోసం అసెంబ్లీ ప్రత్యేక సెషన్ నిర్వహించి బిల్లు పాస్ చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ జాగృతి కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని 12 వేల ప్రైవేట్ స్కూల్స్ లో 38 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని చెప్పారు. ఆయా విద్యార్థుల తల్లితండ్రులపై ప్రైవేట్ స్కూల్స్ అడ్డగోలుగా ఫీజుల భారం మోపుతున్నాయని మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టం తేవటంలో విఫలమైందంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్ రెడ్డి ఆరోపణలు చేశారని గుర్తు చేశారు. ఇప్పుడు ఆయనే ముఖ్యమంత్రిగా ఉండి ఫీజుల నియంత్రణ చట్టం ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు అయినా ఇప్పటి వరకు ఫీజుల నియంత్రణ చట్టం తీసుకువచ్చే ప్రయత్నమే చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విద్య కమిషన్ అతి చెత్త నివేదిక ఇచ్చిందని.. ఆ కమిషన్ ఇచ్చిన నివేదికలో ప్రైవేట్ స్కూళ్లు, జూనియర్ కాలేజీల్లో ఫీజుల నియంత్రణకు చట్టం చేయాలి అనే సిఫార్సు మాత్రమే ఆమోదయోగ్యమైనదని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఫీజుల దోపిడీని ప్రోత్సహించిందని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఫీజుల దోపిడీని ప్రోత్సహిస్తే బీఆర్ఎస్ కు పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ఒకే సారి 40 శాతం ఫీజులు పెంచితే పేద, మధ్యతరగతి పిల్లల తల్లితండ్రుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ప్రైవేట్ స్కూల్స్ ఫీజుల పెంచుతున్న స్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రుల జీతాలు పెరగడం లేదన్నారు. 7 శాతం నుంచి 8 శాతం ఫీజు మాత్రమే పెంచేందుకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి తప్ప అంతకు మించి ఫీజుల దోపిడీకి సహకరించొద్దన్నారు. కార్పొరేట్, నార్త్ ఇండియన్ స్కూల్స్ ఏర్పాటుతో తెలంగాణ నిరుద్యోగులకు అన్యాయం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఆయా కాలేజీల యాజమాన్యాలు ఇక్కడి నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇవ్వడం లేదన్నారు. ఏటా భారీగా స్కూల్ ఫీజులు పెంచుతూన్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్ల యాజమాన్యాలు వాటిలో పని చేస్తున్న టీచర్లు, ఉద్యోగుల జీతాలు మాత్రం పెంచడం లేదన్నారు. నారాయణ, చైతన్య లాంటి స్కూల్స్ లో లక్ష మంది విద్యార్థులు చదువుతున్నారని, ఏటా వందల కోట్ల వ్యాపారం చేస్తున్న ఆయా సంస్థలు వివిధ పేర్లతో ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులు ఎగ్గొడుతున్నాయని చెప్పారు. కనీసం మంచి ఫుడ్, టీచర్లకు పీఎఫ్, మ్యాచింగ్ గ్రాంట్స్ కూడా సరిగా ఇవ్వటం లేదన్నారు. వేలాది మంది విద్యార్థులకు నారాయణ, చైతన్య లాంటి స్కూల్స్ లో ఒకే చోట ఫుడ్ వండుతున్నారని, వాటిపై దాడులు చేసి విద్యార్థులకు మంచి భోజనం పెట్టే స్థాయిలో కూడా మన ప్రభుత్వాలు లేవన్నారు. విద్యార్థుల తల్లితండ్రులను గౌరవించని స్కూల్స్ పై రైడ్స్ చేయాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్, నార్త్ ఇండియన్ స్కూల్స్ లో తెలంగాణ వారికి కనీసం ధోబిగా కూడా అవకాశం ఇవ్వటం లేదన్నారు. అలాంటి స్కూల్స్ కు పర్మిషన్ ఇవ్వొద్దని తేల్చిచెప్పారు. తెలంగాణ వారికి ఎంప్లాయిమెంట్ ఇవ్వని స్కూల్స్ మనకెందుకని ప్రశ్నించారు. కార్పొరేట్ స్కూల్స్ సొంతంగా ప్రింటింగ్ ప్రెస్ లు పెట్టుకొని రూ.2 వేల విలువైన పుస్తకాలను రూ.15 వేలకు అమ్ముతున్నారని తెలిపారు. కార్పొరేట్ స్కూళ్లలో పనిచేస్తున్న టీచర్ల పరిస్థితి దుర్భరంగా ఉందని, ప్రైవేట్ టీచర్ల హక్కుల సాధన కోసం జాగృతి తరఫున పోరాటం చేస్తామన్నారు. ప్రభుత్వం ఫీ రీయింబర్స్ మెంట్ బకాయిలు చెల్లించలేదనే కారణంగా ప్రైవేట్ ప్రొఫెషనల్ కాలేజీలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదన్నారు. దీంతో విద్యార్థులు ఉద్యోగ అవకాశాలు, ఉన్నత విద్య అవకాశాలను కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల సర్టిఫికెట్లు ఆపొద్దని హైకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినా ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలు విద్యార్థులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. ప్రైవేట్ కాలేజీలకు రావాల్సిన ఫీ రీయింబర్స్ మెంట్ బకాయిల కోసం వాళ్లతో కలిసి ప్రభుత్వంపై పోరాటం చేసి ఇప్పిస్తామన్నారు. ఫీజుల నియంత్రణ చట్టం తెస్తూ ప్రభుత్వం అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టకపోతే తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.


మీరిచ్చే ప్రతి పైసా..
ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి ‘ఈవార్తలు’ నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి ‘ఈవార్తలు’. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


## జీహెచ్ఎంసీకి భారీగా ఆదాయం

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఈవార్తలు): 2025–26 ఆర్థిక సంవత్సరంలో నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ల ద్వారా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)కు ఆదాయం భారీగా పెరిగింది. మొత్తం రూ.1,172.08 కోట్ల ఆదాయం సమకూరినట్లు జీహెచ్ఎంసీ అధికారులు వెల్లడించారు. 2025 మార్చిలోనే 15,536 నిర్మాణాలకు జీహెచ్ఎంసీ అనుమతులు మంజూరు చేసింది. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జీహెచ్ఎంసీకి రూ.1,138.44 కోట్ల ఆదాయం వచ్చింది. గత సంవత్సరంతో పోలిస్తే ఈసారి రూ.34.36 కోట్ల మేర ఆదాయం పెరిగింది. ‘బిల్డ్ నౌ’ పోర్టల్ ద్వారా జీహెచ్ఎంసీ నిర్మాణ అనుమతులు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లను జారీ చేసింది. క్యూర్ అర్బన్ రీజియన్‌లో రూ.2,558.8 కోట్ల ఆస్తి పన్ను వసూలు కాగా, జీహెచ్ఎంసీలో రూ.995.82 కోట్లు, హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.100.36 కోట్లు, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో రూ.562.62 కోట్లు వసూలయ్యాయి. మార్చి నెలలో రూ.453 కోట్ల మేర ఆస్తి పన్ను బకాయిలు వసూలు కాగా, మార్చి 31వ తేదీనే రూ.162.94 కోట్లు వసూలయ్యాయి.

## మాకు 100 గ్యారెంటీ: టీపీసీసీ చీఫ్



హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఈవార్తలు): తెలంగాణలో బీఆర్ఎస్ తన ఉనికిని కోల్పోయిందని, బీజేపీకి ఇక్కడ స్థానం లేదని పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ విమర్శించారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు కాంగ్రెస్‌నే నమ్ముతున్నారని, ఇటీవల జరిగిన ఎన్నికల ఫలితాలే అందుకు నిదర్శనమని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ పతనం ప్రారంభమైందని మహేశ్ గౌడ్ అన్నారు. ఎమ్మెల్సీ కవిత సొంతంగా వేరు కుంపటి పెట్టుకోవడంతో బీఆర్ఎస్ పరిస్థితి రోడ్డున పడిందని చెప్పారు. పార్టీలో కేటీఆర్, హరీశ్ రావు మధ్య ఆధిపత్య పోరు నడుస్తోందని, దీనివల్ల అంతర్గత కలహాలు తారాస్థాయికి చేరుకున్నాయని పేర్కొన్నారు. మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు దూరమై కేవలం తన ఫామ్‌హౌస్‌కే పరిమితమయ్యారని ఎద్దేవా చేశారు. ఎన్నికలు వచ్చినప్పుడల్లా బీజేపీ దేవుడి పేరు చెప్పి ఓట్లు అడుగుతోందని, ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని ఆయన అన్నారు. అందుకే ఆ పార్టీని ప్రజలు దూరం పెడుతున్నారని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందని ధీమా వ్యక్తం చేశారు. “ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగినా కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేస్తుంది. రాష్ట్రంలో మాకు 100 సీట్లు రావడం ఖాయం” అని ఆయన జోస్యం చెప్పారు.

## ‘గోల్డ్ మ్యాన్’ పోజులు.. బంగారం సీజ్

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఈవార్తలు): ఆదాయపు పన్ను (ఐటీ) శాఖ హైదరాబాద్‌లో మరో ‘గోల్డ్ మ్యాన్’ కేసును వెలుగులోకి తెచ్చింది. యాదగిరి చిన్న గౌడ్ అలియాస్ దర్గా చిన్న పహిల్వాన్ అనే వ్యక్తి నుంచి సుమారు రూ.1 కోటి విలువైన, లెక్కల్లో చూపని బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు ప్రకటించారు. ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి వచ్చిన కొత్త ఆదాయపు పన్ను చట్టం–2025లోని సెక్షన్ 247 కింద దేశవ్యాప్తంగా నమోదైన తొలి కేసు ఇదే కావడం గమనార్హం. గతంలో ఇలాంటి చర్యలను పాత చట్టంలోని సెక్షన్ 132 కింద తీసుకునేవారు. ఐటీ శాఖ హైదరాబాద్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ అధికారులు చిన్న పహిల్వాన్‌పై దాడులు నిర్వహించారు. అతని వద్ద మొత్తం 900 గ్రాముల బంగారం ఉండగా, అందులో 700 గ్రాములకు సరైన లెక్కలు చూపలేదని గుర్తించారు. దీంతో ఆ బంగారాన్ని స్వాధీనం చేసుకుని, వ్యక్తిగత వినియోగం కోసం సుమారు 150 నుంచి 200 గ్రాముల బంగారాన్ని తిరిగి ఇచ్చినట్లు తెలిపారు. టీవీ ఛానళ్లు, యూట్యూబ్‌లో చిన్న పహిల్వాన్ ఇచ్చిన ఇంటర్వ్యూల ఆధారంగా సోషల్ ప్రొఫైలింగ్ చేసి ఈ దర్యాప్తు ప్రారంభించినట్లు ఐటీ అధికారులు వెల్లడించారు. అతను భారీగా బంగారు ఆభరణాలు ధరించి కనిపించడంతో అనుమానం వచ్చి విచారణ చేపట్టారు. హైదరాబాద్‌లో ఐటీ శాఖ దృష్టికి వచ్చిన మూడో ‘గోల్డ్ మ్యాన్’ చిన్న పహిల్వాన్. ఇంతకుముందు కొండా విజయకుమార్, సూర్య భాయ్ అనే వ్యక్తులపైనా ఇలాంటి చర్యలు తీసుకున్నారు. విచారణలో తన వద్ద ఉన్న బంగారం లెక్కల్లో లేనిదని చిన్న పహిల్వాన్ అంగీకరించినట్లు సమాచారం. అద్దెలు, భూముల వ్యాపారం ద్వారా ఈ బంగారం సంపాదించినట్లు చెప్పినా, ఆదాయానికి సరైన ఆధారాలు చూపించలేకపోయారు. అతను దాఖలు చేసిన ఒకే ఐటీ రిటర్న్‌లో కేవలం రూ.4 లక్షల ఆదాయం మాత్రమే చూపినట్లు అధికారులు గుర్తించారు. జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ (జీపీఏ)పై భూములు కొని, వాటిని ఎక్కువ ధరకు అమ్మి, మధ్యలో తేడా మొత్తాన్ని నగదుగా తీసుకునేవారని దర్యాప్తులో తేలింది. చిన్న పహిల్వాన్‌తో పాటు అతని కుటుంబ సభ్యుల ఆర్థిక లావాదేవీలపైనా అధికారులు దృష్టి సారించారు.

## 2047 నాటికి టెక్స్‌టైల్ తెలంగాణ

### ఇక్కడి వస్త్రాలు ప్రపంచం ధరించేలా చేస్తా

### ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్‌లో రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఈవార్తలు): 2047 నాటికి తెలంగాణను దక్షిణ ఆసియాకు టెక్స్‌టైల్ రాజధానిగా తీర్చిదిద్దడమే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో జరిగిన ఏషియన్ టెక్స్‌టైల్ కాన్ఫరెన్స్ 2026లో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో తయారైన వస్త్రాలను ప్రపంచంలోని ప్రతి దేశంలో ప్రజలు ధరించేలా చేయాలన్నదే తన ఆశయమని అన్నారు. టెక్స్‌టైల్ రంగంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చే వారికి అన్ని రకాలుగా అండగా ఉంటామని సీఎం భరోసా ఇచ్చారు. పెట్టుబడిదారులకు అవసరమైన భూమి, విద్యుత్, నీరు, రాయితీలతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, అనుమతులు కూడా వేగంగా మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. “మీకు విజన్ ఉంటే, మీకు సరైన భాగస్వాములం మేమే. కలిసికట్టుగా ప్రపంచాన్ని మార్చగల టెక్స్‌టైల్ వ్యవస్థను నిర్మిద్దాం” అని ఆయన పిలుపునిచ్చారు. తెలంగాణ వస్త్రాలకు ఘనమైన చరిత్ర ఉందని, పోచంపల్లి ఇక్కత్, గద్వాల చీరల నుంచి వరంగల్ దర్రీల వరకు ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయని సీఎం గుర్తుచేశారు. దేశంలోనే అత్యధికంగా నాణ్యమైన పత్తిని ఉత్పత్తి చేస్తున్న రాష్ట్రంగా తెలంగాణకు ప్రపంచవ్యాప్త గుర్తింపు ఉందని తెలిపారు. వరంగల్‌లో ప్రపంచ స్థాయి కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ అందుబాటులో ఉందని వివరించారు. హైదరాబాద్ ఫిల్మ్ ప్రొడక్షన్‌కు హబ్‌గా మారుతోందని, నెట్‌ఫ్లిక్స్ వంటి సంస్థలు ఇక్కడ స్టూడియోలు ఏర్పాటు చేస్తున్నాయని సీఎం అన్నారు. బాలీవుడ్‌తో పాటు ఇప్పుడు హాలీవుడ్ కూడా హైదరాబాద్ వైపు చూస్తోందని, సినిమా పరిశ్రమ ఫ్యాషన్ అవసరాలను స్థానికంగానే తీర్చేలా ప్రోత్సహిస్తామని తెలిపారు. పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ రాష్ట్రంలో గ్రీన్ టెక్స్‌టైల్ హబ్‌లను అభివృద్ధి చేస్తామని, యువతకు, ముఖ్యంగా మహిళలకు నైపుణ్య శిక్షణ ఇస్తామని రేవంత్ రెడ్డి వెల్లడించారు.

## కాస్టింగ్ కౌచ్‌వల్లే ఎదగలేకపోతున్నాం: పూనమ్




హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఈవార్తలు): చిత్ర పరిశ్రమలో ‘కమిట్‌మెంట్’ సంస్కృతిపై నటి పూనమ్ కౌర్ మరోసారి గళం విప్పారు. ఓ నిర్మాత తనను కమిట్‌మెంట్ అడిగాడని ఆరోపిస్తూ ఓ ఎన్నారై తెలుగు యువతి విడుదల చేసిన వీడియోపై స్పందిస్తూ ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర చర్చనీయాంశమయ్యాయి. ఆ యువతి వీడియోను తన ఎక్స్ ఖాతాలో పంచుకున్న పూనమ్, ఆమెకు తన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా పూనమ్ తన ఆవేదనను వ్యక్తం చేశారు. “తెలుగు పరిశ్రమలో ఒకప్పుడు ఉన్న సావిత్రి, జయప్రద, భానుప్రియ, శ్రీదేవి, సౌందర్య లాంటి గొప్ప నటీమణులు ఇప్పుడు ఎందుకు లేరు? అందం, అన్ని అర్హతలున్న ఎంతో మంది తెలుగు కళాకారులను నేను వ్యక్తిగతంగా కలిశాను. నాకు కూడా ఇదే బాధగా ఉంది” అని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. ఓ నిర్మాత తనను కమిట్‌మెంట్ అడిగాడని ఆ ఎన్నారై యువతి వీడియోలో ఆరోపించడం టాలీవుడ్‌లో మరోసారి కలకలం రేపింది.

## కార్బైడ్ పండ్లతో జాగ్రత్త

హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఈవార్తలు): వేసవి వచ్చిందంటే చాలు, పండ్లలో రారాజైన మామిడి పండ్ల కోసం అందరూ ఎదురుచూస్తుంటారు. అయితే, మార్కెట్లో కంటికి ఇంపుగా కనిపించే ఈ పండ్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ హెచ్చరించారు. కాల్షియం కార్బైడ్ వంటి రసాయనాలతో కృత్రిమంగా పండిస్తున్న మామిడి పండ్లతో తస్మాత్ జాగ్రత్త అంటూ ఆయన సోషల్ మీడియా వేదికగా ప్రజలకు కీలక సూచనలు చేశారు. కొందరు స్వార్థపరులైన వ్యాపారులు, కేవలం కాసుల కక్కుర్తితో ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సహజ సిద్ధంగా కాకుండా, కాల్షియం కార్బైడ్ వంటి ప్రమాదకర రసాయనాలను ఉపయోగించి మామిడి కాయలను పండ్లుగా మారుస్తున్నారని ఆరోపించారు. రోడ్డు పక్కన నిగనిగలాడుతూ, ఒకే రకమైన పసుపు పచ్చ రంగులో ఆకర్షణీయంగా కనిపించే పండ్లను చూసి మోసపోవద్దని సూచించారు. సహజంగా పండిన పండు అన్నిచోట్లా ఒకే రంగులో ఉండదని, కానీ రసాయనాలతో పక్వానికి తెచ్చిన పండు పైన పసుపుగా ఉన్నా లోపల పచ్చిగా, రుచిహీనంగా ఉంటుందని వివరించారు. ఇలాంటి కల్తీ పండ్లను తినడం ప్రాణాంతకం కాగలదని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారని సజ్జనార్ తెలిపారు. వీటిని తినడం వల్ల తక్షణమే గొంతు మంట, కడుపులో వికారం, వాంతులు, విరేచనాలు వంటి సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. అంతేకాకుండా, ఈ రసాయనాలు శరీరంలోకి చేరడం వల్ల దీర్ఘకాలంలో నాడీ వ్యవస్థ తీవ్రంగా దెబ్బతినే ప్రమాదం ఉందని, శ్వాసకోశ సంబంధిత వ్యాధులు కూడా తలెత్తవచ్చని వివరించారు. ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే ఇలాంటి కల్తీ వ్యాపారాలపై హైదరాబాద్ పోలీస్ విభాగం ఉక్కుపాదం మోపుతోందని సజ్జనార్ స్పష్టం చేశారు. ఇప్పటికే హెచ్–ఫాస్ట్ (హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్) బృందాలు నగరంలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నాయని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## సారీ నాన్నా.. బంగారంతో బాలుడు పరార్

కూకట్‌పల్లి–హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డు (కేపీహెచ్‌బీ) కాలనీలో ఓ మైనర్ బాలుడి నిర్వాకం తీవ్ర కలకలం రేపింది. 17 ఏళ్ల బాలుడు ఇంట్లోంచి భారీగా నగదు, బంగారం తీసుకుని పరారయ్యాడు. నిన్న జరిగిన ఈ సంఘటన ఇప్పుడు స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది. వివరాల్లోకి వెళితే.. కేపీహెచ్‌బీ కాలనీకి చెందిన 17 ఏళ్ల సిద్ధార్థ్ రెడ్డి, తన ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయాడు. వెళ్తూ వెళ్తూ బీరువాలో ఉన్న 9 తులాల బంగారం, రూ. 8 లక్షల నగదును తన వెంట తీసుకువెళ్లాడు. అంతేగాక తన తండ్రి నాగార్జున రెడ్డికి చెందిన హీరో స్ప్లెండర్ ప్లస్ బైక్‌ను కూడా తీసుకెళ్లాడు. అపహరణకు గురైన సొత్తు మొత్తం విలువ సుమారు రూ. 25 లక్షలు ఉంటుందని బాలుడి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంట్లోంచి వెళ్లేముందు సిద్ధార్థ్ రెడ్డి ఓ లేఖ కూడా రాసిపెట్టాడు. అందులో ‘సారీ నాన్నా’ అని పేర్కొనడం గమనార్హం. తన తండ్రి బైక్‌ను ఎక్కడో ఒకచోట వదిలేస్తానని కూడా ఆ లేఖలో తెలిపాడు. ప్రస్తుతం అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తుండటంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వెంటనే వారు కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తమ కుమారుడు కనిపించడం లేదని, ఇంట్లోంచి నగదు, బంగారం కూడా పోయాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే, సిద్ధార్థ్ రెడ్డి ఇంట్లోంచి పారిపోవడం ఇదే మొదటిసారి కాదని కుటుంబ సభ్యులు పోలీసులకు తెలిపారు. ఈసారి మాత్రం భారీగా డబ్బు, బంగారం తీసుకెళ్లడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేపీహెచ్‌బీ పోలీసులు మిస్సింగ్ కేసుతో పాటు చోరీ కేసు కూడా నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బాలుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.




# యంగ్ ఇండియా స్కూల్స్ నా బ్రెయిన్ చైల్డ్

## విద్యావ్యవస్థలో మార్పులే నా లక్ష్యం.. ఒక్కో విద్యార్థిపై రూ.1.08 లక్షల ఖర్చు

**టీజీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి**

ఇబ్రహీంపట్నం- రంగారెడ్డి, ఏప్రిల్ 3 (ఈవార్తలు): విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. పేదరికానికి ప్రధాన కారణం నాణ్యమైన విద్య అందకపోవడమేనని అభిప్రాయపడిన ఆయన, విద్య ద్వారానే సమాజంలో గుర్తింపు.. గౌరవం లభిస్తాయన్నారు. ప్రభుత్వ విద్యపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని, దేశంలోని అన్ని ప్రాంతాలకు ప్రభుత్వ విద్య అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని ఆయన వెల్లడించారు. ఒక్కో విద్యార్థిపై రాష్ట్ర ప్రభుత్వం ఏటా సగటున లక్షా 8 వేల రూపాయలు ఖర్చు చేస్తోందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఇబ్రహీంపట్నంలోని ఏవీఎన్ లేక్‌ఫీల్డ్ గ్లోబల్ స్కూల్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 100 నియోజకవర్గాల్లో తన బ్రెయిన్ చైల్డ్ లాంటి యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఒక్కో పాఠశాలను 25 ఎకరాల విస్తీర్ణంలో, సుమారు 5 నుంచి 6 లక్షల చదరపు అడుగుల నిర్మాణంతో అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మిస్తున్నామని తెలిపారు. దాదాపు 2,500 మంది విద్యార్థుల సామర్థ్యంతో, రూ. 20,000 కోట్ల భారీ అంచనా వ్యయంతో చేపట్టిన ఈ



ప్రాజెక్టు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారిపోతాయని ధీమా వ్యక్తం చేశారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఇక్కడ నాణ్యమైన విద్య అందుతుందని, విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం, బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం కూడా అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో ఏటా 1.10 లక్షల మంది ఇంజనీరింగ్ విద్యార్థులు ఉత్తీర్ణులవుతున్నప్పటికీ, వారిలో చాలామందికి కేవలం సర్టిఫికెట్లే ఉంటున్నాయని, సరైన ఉపాధి నైపుణ్యాలు ఉండటం లేదని రేవంత్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కారణంగా వైట్ కాలర్ ఉద్యోగాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని, అందుకే విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంచుకుంటూ బ్లూ కాలర్ ఉద్యోగాల వైపు మొగ్గు చూపాలని సూచించారు. ఇందుకోసమే ఆనంద్ మహీంద్రా చైర్మన్‌గా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేశామని, దీని ద్వారా నాణ్యమైన సాంకేతిక విద్యను అందుబాటులోకి తెస్తామని వివరించారు. విద్యతో పాటు క్రీడలకు కూడా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. 2034లో జరిగే ఒలింపిక్స్‌లో తెలంగాణ నుండి క్రీడాకారులు గోల్డ్ మెడల్స్ సాధించడమే లక్ష్యంగా తెలంగాణ స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే బాక్సర్ నిఖత్ జరీన్, క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌లకు డీఎస్పీ ఉద్యోగాలు కల్పించి క్రీడాకారులకు అండగా నిలిచామని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు కూడా అన్ని రంగాల్లో రాణించాలనేదే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలోని 26 వేల ప్రభుత్వ స్కూళ్లలో 18 లక్షల మంది ఉంటే, 11 వేల ప్రైవేట్ స్కూళ్లలో 33 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారని, ప్రభుత్వ విద్య ఎందుకు వెనుకబడిందో అందరూ ఆలోచించాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలపై ప్రజలకు మళ్ళీ నమ్మకం కలిగించేలా విద్యా సంస్కరణలు చేపడుతున్నామని రేవంత్ రెడ్డి వివరించారు. ఆరుట్ల మోడల్ స్కూల్ తరహాలోనే రాష్ట్రవ్యాప్తంగా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, రెండో విడతలో మరిన్ని స్కూళ్లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు.

# తెలంగాణ నా బ్రెయిన్ చైల్డ్

## తెలంగాణకు నేను వ్యతిరేకం కాదు.. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు

ఉండవల్లి-అమరావతి, ఏప్రిల్ 3 (ఈవార్తలు): తెలంగాణకు తాను ఎప్పుడూ వ్యతిరేకం కాదని ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబు అన్నారు. విభజన జరిగినప్పుడు రెండు రాష్ట్రాల ప్రజల మనోభావాలు దెబ్బతిన్నాయన్నారు. రెండు రాష్ట్రాల ప్రజలకు న్యాయం చేసి విభజన చేయాలని కోరామని, రాజధాని లేకుండా ఏపీని విభజించారన్నారు. తెలుగుజాతి కోసం సైబరాబాద్, హైటెక్ సిటీ నిర్మించామన్నారు. పోలవరం ముంపు మండలాలను ఏపీలో కలిపితేనే తాను ప్రమాణం చేస్తానని చెప్పానని సీఎం చంద్రబాబు చెప్పుకొచ్చారు. అమరావతికి చట్టబద్ధత బిల్లు ఆమోదించినందుకు ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు. పుష్కరకాలం కింద అమరావతిని రాజధానిగా నిర్ణయించామని, అది ఇప్పుడు చట్టబద్ధత పొందిందని సీఎం పేర్కొన్నారు. ఉండవల్లిలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు మాట్లాడారు. 'చాలా సంతోషంగా ఉంది. రాష్ట్ర ప్రజలకి ఒక సందేశాన్ని ఇవ్వడానికి ఈ కార్యక్రమం పెట్టాను. అమరావతిని చట్టం చేసి 12సంవత్సరాలు అయ్యింది. రాజధానిగా అమరావతిని పార్లమెంట్ ఆమోదించడం ప్రజా విజయంగా భావిస్తున్నా. పార్లమెంట్లో 10 పార్టీలు మద్దతు ఇచ్చాయి. మిగిలిన పార్టీలు పరోక్షంగా మద్దతు పలికారు. లోక్ సభలో 41 పార్టీలు ఉన్నాయి. 9 పార్టీలు రాజ్యసభలో ఉన్నాయి. అన్ని కలిపి 50 పార్టీలు. నేరుగా చాలా మంది సహకరించారు. ఒకే ఒక్క పార్టీ వైసీపీ మాత్రం ఈ రాష్ట్రానికి ద్రోహం చేసే ప్రయత్నం చేసింది. 2024 జూన్ 2 నుంచి అమరావతి రాజధానిగా శాశ్వతంగా ఉంటుంది. రాష్ట్రపతి ఆమోద ముద్రతో చట్టంగా వస్తుంది. ప్రధాని మోడీకి ధన్యవాదాలు తెలియచేస్తున్నా. ప్రధాని అన్ని విధాలుగా సహకరించారు' అని సీఎం చెప్పారు. 'అమరావతి రాజధానిగా ఉండాలని దేశ ప్రయోజనాల కోసం చాలా పార్టీలు ఆలోచించాయి. కానీ వైసీపీ మాత్రం అమరావతిని నాశనం చేయాలని చూసారు. కుట్ర దాటి అమరావతి గెలిచింది. ప్రజల ఆశలు, ఆశయాలు నెరవేరిన సందర్భం ఇది. భవిష్యత్లో ఎవరు ఏమి చెయలేని విధంగా జరిగింది. రెండు ప్రాంతాలు సమన్వయం చేయాలనీ ఆనాడు



తెలియచేసా. పరిష్కారం కాకుండా విభజన జరిగింది. పోలవరం ఒక సంకల్పం. ఒక 7 మండలాలు తెలంగాణాలో కలిపారు. కానీ ఆనాడు 7 మండలాలు ఏపీకి ఇవ్వాలని ప్రధాని మోడీని కోరాను. నేనెప్పుడూ తెలంగాణాకి వ్యతిరేకిని కాదు. విభజిత ఏపీలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ఇరిగేషన్ కార్యాలయానికి బస్సులో బస చేశా. శివరామక్రిష్ణ కమిటీ రాష్ట్ర రాజధాని కోసం తిరగడం జరిగింది. గుంటూరు విజయవాడ రాజధాని అయితే సిఫార్సు చేసారు. అప్పుడు వైసీపీ నాయకులూ విన్యాసాలు వేసి అందరిని రెచ్చగొట్టారు. అధికార వికేంద్రికరణ చేస్తూనే భవిష్యత్ కోసం ఒక సంకల్పం చేసాము. రెండు ప్రాంతాలకి సమాన దూరం ఉండేలా ఒక ప్రదేశాన్ని ఎంపిక చేసాము' అని సీఎం తెలిపారు. 'వైసీపీ రాష్ట్ర ప్రజల ప్రయోజనాలకు విరుద్ధంగా వ్యవహరించింది. అమరావతి నాశనం అయినా పర్వాలేదని వైసీపీ నేతలు అనుకున్నారు. కానీ మనం 'శాసనం' చేసుకున్నాం. కేంద్ర ప్రభుత్వ రాజముద్రతో 5 కోట్ల ఆంధ్రుల ఆశలు, ఆశయాలు నెరవేరాయి. అమరావతిని ఇక భవిష్యత్తులో ఎవరూ ఏమీ చేయలేరు. విభజన సమయంలో రెండు రాష్ట్రాల్లోనూ భావోద్వేగాలు ఉన్నాయి. తెలుగు జాతి ప్రయోజనాల కోసం సంపద సృష్టికి ఓ ప్రాంతం తయారుకావాలనే హైదరాబాద్లో సైబరాబాద్ నిర్మాణం చేశాం. రెండు ప్రాంతాలకూ సమన్యాయం చేయాలని ఆ రోజు చెప్పాం. చాలా అంశాలు పరిష్కారం కాకున్నా విభజన జరిగింది. ఆర్థిక కష్టాలు, రాజధాని లేదు, వనరులు లేవు అన్నీ ఇబ్బందులే. అప్పాయింటెడ్ డే జూన్ 2 కంటే ముందే తెలంగాణలో ఉన్న 7 పోలవరం ముంపు మండలాలు ఏపీలో కలపాలని కోరాను. తెలంగాణాకు నష్టం కలగాలని ఎప్పుడూ కోరుకోను. ఇవాళ హైదరాబాద్లో ఇంతటి సంపద కలిగిందంటే సైబరాబాద్ లాంటి నగరాల నిర్మాణమే. చాలా మంది ఎంపీలు గుర్తించి పార్లమెంటులోనూ ఇది ప్రస్తావించారు. ఆ గౌరవాన్ని ఎప్పుడూ పోగొట్టుకోను. రాజధాని లేకుండా విజయవాడకు వచ్చాం. ఒక ఎస్ఈ కార్యాలయంలో ఆఫీసు ఏర్పాటు చేసుకుని, బస్సులో బస చేసి కార్యకలాపాలు ప్రారంభించాం. ఏమీ లేకుండా రాష్ట్రం ఏర్పడిందనటానికి అవే ప్రత్యక్ష ఉదాహరణ. శివరామకృష్ణన్ కమిటీని కేంద్రం ఏర్పాటు చేస్తే 46 శాతం మంది ప్రజలు విజయవాడ-గుంటూరు మధ్య రాజధానికి ఏర్పాటుకు అనుకూలమని పేర్కొన్నారు. అయితే వైసీపీ చాలా డ్రామాలు ఆడింది. అధికార వికేంద్రీకరణ చేస్తూనే మనకంటూ ఓ రాజధాని ఉండాలని మేం సంకల్పం చేశాం. ఆ సంకల్పంలో భాగమే మూడు ప్రాంతాలకు సమాన దూరంలో ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక చేశాం. రాష్ట్రం మధ్యలో ఉన్న ప్రాంతంగా, కనెక్టివిటీ పరంగా, భౌగోళికంగా, చారిత్రాత్మక ప్రదేశంగా రాజధానిగా ఎంపిక చేసి ప్రణాళికలు చేశాం' అని పేర్కొన్నారు.



## జగిత్యాల ధన్వంతరి ఆలయంలో ప్రత్యేక పూజలు

జగిత్యాల టౌన్, ఏప్రిల్ 3 (ఈవార్తలు): జగిత్యాల పట్టణ చింతకుంటలోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. చైత్రమాసం పాడ్యమిని పర్వదినం పురస్కరించుకొని మాతలు అమ్మవారికి ప్రత్యేక కుంకుమార్చన, లలితా సహస్ర నామాల స్తోత్ర పారాయణం చేసారు. కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ వడ్లగట్ట రాజన్న, వర్కింగ్ ప్రెసిడెంట్ వోద్నాల శ్రీనివాస్, మహిళా సభ్యులు వడ్లగట్ట స్వాతి, గాల్లిపెల్లి సుజాత, మాధురి, సన్నిహిత, జమున, హర్షిణి, శ్రీ కీర్తన, వసుంధర, విన్నాత్రి గంగవ్వ, అర్చకుడు శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.




## మల్యాలలో వ్యాపారుల సేవా కార్యక్రమం

మల్యాల, ఏప్రిల్ 3 (ఈవార్తలు): హనుమాన్ విజయోత్సవం సందర్భంగా జగిత్యాల జిల్లా మల్యాల మండల కేంద్రంలోని శివాలయం వీధిలో దుకాణాల వ్యాపారులు సేవా కార్యక్రమం నిర్వహించారు. కొండగట్టుకు కాలినడకన వెళ్లే భక్తులకు పాలు, నీళ్లు, అరటి పండ్లు పంపిణీ చేశారు. వ్యాపారులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి భక్తులకు సేవ చేశారు. దీక్షాస్వాములకు పాలు, అరటి పండ్లు పంచి భక్తి భావాన్ని చాటుకున్నారు.

## చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్తుపై అవగాహన

కాకినాడ, ఏప్రిల్ 3 (ఈవార్తలు): ఏపీలోని కాకినాడ జిల్లా పిఠాపురం నియోజవర్గం గొల్లప్రోలు చేనేత సొసైటీలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ సూరిశెట్టి జయకృష్ణ అధ్యక్షతన శుక్రవారం



అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం నేతన్నలకు చేనేత కార్మికులకు సంబంధించి సాధారణ మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్తు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గొల్లప్రోలు జనసేన పార్టీ ప్రెసిడెంట్ మామిడాల సూరిబాబు, టీడీపీ గొల్లప్రోలు పార్టీ అధ్యక్షుడు గుండ్ర సుబ్బన్న, బీజేపీ పార్టీ ప్రెసిడెంట్ మధు, జనసేన నాయకుడు కడారి తమ్మయ్య నాయుడు, గొల్లప్రోలు మండల చేనేత ఇంచార్జ్ ఏడీవో రాంబాబు, చేనేత కుల కార్మికులు తదితరులు పాల్గొన్నారు.


# స్పెషలాఫీసర్ల చేతులో పల్లె పాలన

## ముగిసిన సర్పంచుల పదవీకాలం.. ఎన్నికలపై త్వరలో ఏపీ సర్కారు నిర్ణయం?

కాకినాడ, ఏప్రిల్ 3 (ఈవార్తలు): ఏపీలో గ్రామ పంచాయితీల సర్పంచుల పదవీకాలం ముగియడంతో, పంచాయితీల పరిపాలన బాధ్యతలు తాత్కాలికంగా ప్రభుత్వ అధికారులు చేతుల్లోకి వెళ్లాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో), తహసీల్దార్ (ఎమ్మార్వో), మండల విద్యా అధికారి (ఎంఈఓ)లను ప్రత్యేక అధికారులుగా నియమించారు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో కొత్త ఎన్నికలు జరిగే వరకు గ్రామ పంచాయితీలలో అభివృద్ధి పనులు, నిధుల వినియోగం, శానిటేషన్ వంటి అంశాలను ఈ అధికారులు పర్యవేక్షించనున్నారు. గ్రామ స్థాయిలో ప్రజలకు అవసరమైన సేవలు అంతరాయం లేకుండా కొనసాగించాలని ప్రభుత్వం సూచించింది. అయితే ప్రజా ప్రతినిధులు లేకపోవడంతో గ్రామాల్లో కొన్ని సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా తక్షణ సమస్యల పరిష్కారంలో ఆలస్యం జరిగే అవకాశముందని చెబుతున్నారు. ఇదిలా ఉండగా, పంచాయితీ ఎన్నికలను త్వరగా నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారు. ఎన్నికల షెడ్యూల్‌పై ప్రభుత్వం త్వరలోనే నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

**త్వరలోనే స్థానిక ఎన్నికలు**

మరోవైపు రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధమవుతోంది. గ్రామ పంచాయతీల పాలకమండలి పదవీ కాలం ముగిసిన ఈసీ కూడా వేగం పెంచనుంది. ఇప్పటికే గత కొంత కాలంగా ఎన్నికల నిర్వహణకు ఈసీ కసరత్తు చేస్తోంది. రాష్ట్రంలోని పంచాయతీ ఎన్నికల కోసం కొత్త ఓటర్ల జాబితాలు సిద్ధమయ్యాయి. ఓటర్ల ఫొటోలతో సహా తుది జాబితాలు ప్రచురితమయ్యాయి. అసెంబ్లీ ఓటర్ల



జాబితా ఆధారంగా వార్డుల వారీగా విభజన చేపట్టి పొరపాట్లు లేకుండా ఈసీ చర్యలు తీసుకుంది. మరోవైపు సర్పంచ్ ఎన్నికల నిర్వహణకు ఏపీ ప్రభుత్వం కూడా మొగ్గు చూపే అవకాశం ఉంది. ఈసీ ప్రతిపాదనలకు గ్రీన్ సిగ్నల్ ఇస్తే, ఎన్నికల నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశం ఉంటుంది. సర్పంచ్ ఎన్నికలు రాబోతున్న వేళ గ్రామాల్లోనూ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. ఇప్పటికే పోటీ చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నవాళ్లు.. పావులు కదిపే పనిలో పడ్డారు. రిజర్వేషన్ల ఖరారు అయితే పోటీపై మరింత స్పష్టతకు రానున్నారు. ఇక మున్సిపాలిటీల్లోనూ చైర్మన్, వైస్ చైర్మన్ల పదవులపై చాలా మంది ఆశలు పెట్టుకుని ఉన్నారు. ప్రధాన పార్టీలలో పని చేస్తున్న పలువురు నేతలు ఇప్పట్నుంచే వ్యూహాలకు పదును పెడుతున్నారు.

## ఒళ్లు దగ్గరపెట్టుకుని మాట్లాడు

**రఘురామకు ఐపీఎస్ సునీల్ వార్నింగ్**

విజయవాడ, ఏప్రిల్ 3 (ఈవార్తలు): ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై సీనియర్ ఐపీఎస్ అధికారి సునీల్ కుమార్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అత్యంత ఘాటైన పదజాలంతో, వ్యక్తిగత విమర్శలు చేస్తూ సంచలన వ్యాఖ్యలు చేశారు. "గేదెలా పెరిగావ్, నీకు సంస్కారం లేదా? మీ అమ్మానాన్న నీకు నేర్పించలేదా?" అంటూ రఘురామను ఉద్దేశించి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన వస్త్రధారణపై రఘురామ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ సునీల్ కుమార్ తీవ్రంగా స్పందించారు. "నేను వేసుకున్న కోటు గురించి మాట్లాడటానికి నువ్వెవరు? నీ సొమ్ములతో ఏమైనా కొనిచ్చావా? 'వాడు, వీడు' అని మాట్లాడతావా? గోదావరి జిల్లాల్లో... పనిచేసే వాళ్లను కూడా 'బాబు' అని గౌరవంగా పిలుస్తారు. ఆ సంస్కారం కూడా నీకు లేదా?" అని ప్రశ్నించారు. "పొద్దున లేస్తే బ్యాంకులను మోసం చేస్తే గానీ నువ్వు బతకలేవు!" అంటూ తీవ్ర ఆరోపణలు చేశారు. రఘురామ తన చుట్టూ ఎంగిలి మెతుకులు తినే కుక్కలను తయారు చేసుకున్నాడని, ఆయనకు మద్దతిచ్చే రెండు ఛానళ్లను ఎవరూ పట్టించుకోరని అన్నారు. "నువ్వెంత, నీ బతుకెంత? సంస్కారం, హద్దులు దాటి మాట్లాడితే ఎవరూ చూస్తూ ఊరుకోరు. ఈసారి ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడు. లేదంటే నేను కూడా తిట్టాల్సి ఉంటుంది... మాట్లాడడం మాకూ వచ్చు" అని సునీల్ కుమార్ తీవ్రంగా హెచ్చరించారు.

## అమరావతికి 200 ఏళ్లు పడుతుంది

**చంద్రబాబుపై రాచమల్లు విమర్శలు**

తాడేపల్లి, ఏప్రిల్ 3 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణం పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబు భారీ కుంభకోణానికి పాల్పడుతున్నారని వైసీపీ నేత రాచమల్లు శివప్రసాద్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దేవతల రాజధాని నిర్మిస్తామంటూ 2014లో మొదలుపెట్టిన ఈ ప్రాజెక్టు కేవలం భూ దోపిడీకే పరిమితమైందని ఆయన ఆరోపించారు. బంగారు పండించే 50 వేల ఎకరాల భూములను రైతుల నుంచి దుర్మార్గంగా లాక్కున్నారని మండిపడ్డారు. రెండు లక్షల కోట్ల వ్యయంతో లక్ష ఎకరాల్లో నిర్మాణం చేపడతామన్న బాబు, గత ఏడేళ్లలో కేవలం 80 కోట్లు మాత్రమే ఖర్చు చేశారని విమర్శించారు.

## అమరావతిపై చంద్రబాబు మాట తప్పారు: శ్రీకాంత్ రెడ్డి

అమరావతి, ఏప్రిల్ 3 (ఈవార్తలు): ఏపీ రాజధానిపై చంద్రబాబు మాట మారుస్తున్నారని వైసీపీ నేత శ్రీకాంత్ రెడ్డి మండిపడ్డారు. అమరావతిని రెండేళ్లలో పూర్తి చేస్తానన్న వ్యక్తి, ఇప్పుడు అది 'నిరంతర ప్రక్రియ' అనడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. శ్రీకృష్ణ, శివరామకృష్ణన్ కమిటీలు అమరావతిని రాజధానిగా చెప్పలేదని, కేవలం ఇన్సైడర్ ట్రేడింగ్ కోసమే చంద్రబాబు కమిటీల పేర్లు వాడుతున్నారని ఆరోపించారు. అమరావతిని 'దేవతల రాజధాని' అంటున్న బాబు, పరమశివుడు తిరుగాడిన కర్నూలుకు హైకోర్టు రాకుండా అడ్డుకున్నారని ధ్వజమెత్తారు. రాయలసీమ ప్రాజెక్టులను తాకట్టు పెట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. పార్లమెంట్ భవనం చదరపు అడుగు రూ. 4 వేలకు కడితే, అమరావతిలో రూ. 12 వేలు ఎందుకు ఖర్చు చేస్తున్నారని నిలదీశారు. ప్రస్తుతం ఉన్న నగరాలను ఈ సొమ్ముతో అభివృద్ధి చేస్తే ఎంతో సంపద సృష్టించేవాళ్లమన్నారు. విట్, ఎస్ఆర్ఎం వంటి ప్రైవేటు సంస్థల కోసం వెంపర్లాడే బాబు, జగన్ తెచ్చిన 17 మెడికల్ కాలేజీలను నిర్లక్ష్యం చేయడం దారుణమన్నారు. మిగతా రాష్ట్రాల్లాగే మనకూ ఒక మంచి నగరం ఉండాలని వైజాగ్ గురించి జగన్ చెబితే నానా యాగీ చేశారని విమర్శించారు. విజయవాడ, గుంటూరు, మచిలీపట్నం వంటి నగరాలను తక్కువ ఖర్చుతో అభివృద్ధి చేసే అవకాశం ఉన్నా చంద్రబాబు పట్టించుకోలేదని మండిపడ్డారు. చట్టబద్ధత పేరుతో అమరావతిని కేంద్రం చేతుల్లో పెట్టి రాష్ట్రానికి అన్యాయం చేశారని మండిపడ్డారు.

## మాపై వివక్ష చూపారు

**ఉపరాష్ట్రపతికి వైసీపీ ఎంపీల ఫిర్యాదు**

న్యూఢిల్లీ: అమరావతి బిల్లుపై పార్లమెంట్‌లో జరిగిన చర్చలో తమకు సరైన ప్రాతినిధ్యం కల్పించలేదని వైసీపీ ఎంపీలు ఆరోపించారు. రాజ్యసభలో తమ పార్టీకి ఏడుగురు ఎంపీలు ఉన్నప్పటికీ, కేవలం 5 నిమిషాలు మాత్రమే సమయం ఇచ్చారని వారు ఉపరాష్ట్రపతి దృష్టికి తీసుకెళ్లారు. అదే సమయంలో కేవలం ఇద్దరు ఎంపీలు ఉన్న తెలుగుదేశం పార్టీకి మాత్రం 20 నిమిషాల సమయం కేటాయించడాన్ని వారు తప్పుబట్టారు. తాము అమరావతికి వ్యతిరేకం కాదని, కానీ తమపై ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తున్నారని వైసీపీ ఎంపీలు ఆవేదన వ్యక్తం చేశారు.


## పోలీసులపై పేర్ని నాని ఫైర్

మచిలీపట్నం, ఏప్రిల్ 3 (ఈవార్తలు): మచిలీపట్నంలో ఒక ఇంటి కూల్చివేత ఉదంతం రాజకీయంగా పెను దుమారం రేపుతోంది. మాజీ మంత్రి, వైసీపీ సీనియర్ నేత పేర్ని నాని, ఆయన తనయుడు పేర్ని కిట్టులపై పోలీసులు కేసులు నమోదు చేసిన సంగతి తెలిసిందే. తమపై కేసు నమోదు చేయడంపై పేర్ని నాని ఘాటుగా స్పందించారు. "పోలీసులు మమ్మల్ని ఏకవచనంతో దూషించలేదా? తప్పుడు నాయకులు ఉన్నట్లే, తప్పుడు అధికారులు కూడా ఉంటారు" అని మండిపడ్డారు. జిల్లాలోని 4 వేల మంది అధికారుల్లో 3 వేల మంది నిజాయతీపరులేనని, కానీ కొందరు మాత్రం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. "రెడ్ బుక్ రాజ్యాంగం రాగానే పామర్రులో ఒక సీఐకి పోస్టింగ్ ఇచ్చి, జాయిన్ అవ్వగానే ఎందుకు ఖాళీ చేయించారు?" అని ప్రశ్నించారు. ప్రభుత్వ తప్పులను నిలదీయడమే తన పని అని పేర్ని నాని స్పష్టం చేశారు. "నన్ను జైలుకు పంపినా సరే, ఇలాగే ప్రశ్నిస్తూనే ఉంటాను. తప్పు చేసిన అధికారిని నిలదీస్తే అందరినీ అన్నట్లు కాదు" అని వివరణ ఇచ్చారు. నిన్నటి గొడవలో పోలీసులు తమతో ప్రవర్తించిన తీరు వల్లే తాము రియాక్ట్ అయ్యామని ఆయన పేర్కొన్నారు. ఘటన వివరాల్లోకి వెళితే... పట్టణంలోని కొబ్బరితోట ప్రాంతంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించారనే సాకుతో ఒక ఇంటిని అధికారులు కూల్చివేయడం ఉద్రిక్తతకు దారితీసింది. ఈ క్రమంలో పోలీసులతో వాగ్వాదానికి దిగిన పేర్ని నాని, ఆయన కుమారుడు పేర్ని కిట్టులపై కేసులు నమోదయ్యాయి. దీనిపై స్పందించిన పేర్ని నాని, కూటమి ప్రభుత్వం, కొందరు అధికారుల తీరుపై నిప్పులు చెరిగారు. ఈ క్రమంలో, పోలీసులపై అభ్యంతరకర పదజాలం వాడారన్న ఇనుగుదురుపేట సీఐ పరమేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుతో పేర్ని కిట్టుపై బీఎన్ఎస్ 132, 351 (2) సెక్షన్ల కింద కేసు నమోదైంది. చిలకలపూడి పోలీస్ స్టేషన్‌లో పేర్ని నానిపై కూడా కేసు ఫైల్ చేశారు.

# సమోసా ధరలపై మాట్లాడటం ఏంటి?

## రాఘవ్ చద్దాపై ఆమ్ ఆద్మీ పార్టీ ఆగ్రహం

న్యూఢిల్లీ: పార్లమెంటులో మాట్లాడటానికి అవకాశం వచ్చినప్పుడు దేశం కోసం మాట్లాడాలి కానీ, విమానాశ్రయాల క్యాంటీన్‌లలో సమోసాల ధర గురించి మాట్లాడటం ఏమిటని రాఘవ్ చద్దాపై ఆమ్ ఆద్మీ పార్టీ ఆగ్రహం వ్యక్తం చేసింది. రాఘవ్ చద్దా లేవనెత్తుతున్న ప్రశ్నలు గత కొంతకాలంగా సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోన్న విషయం తెలిసిందే. విమానాశ్రయాలలో సమోసాల ధరలు, టెలికం సంస్థలు రీఛార్జిని నెల రోజులకు బదుల 28 రోజులు ఇవ్వడమేమిటంటూ ఆయన ప్రశ్నిస్తున్నారు. ఈ క్రమంలో రాజ్యసభలో ఆమ్ ఆద్మీ పార్టీ ఉపనేతగా ఉన్న రాఘవ్ చద్దాను ఆ పార్టీ తొలగించింది. ఆయన స్థానంలో అశోక్ మిట్టల్‌ను నియమించింది. దీంతో ఆమ్ ఆద్మీ పార్టీ, రాఘవ్ చద్దా మధ్య మాటల యుద్ధం సాగతోంది. తానేం తప్పు చేశానని తనను పదవి నుంచి తొలగించారని రాఘవ్ చద్దా ప్రశ్నించారు. ఇలాంటి ప్రయత్నాలతో తన గళాన్ని అణచివేయగలరేమో కానీ తనను ఓడించలేరని అన్నారు. ఈ వ్యాఖ్యలపై ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ మీడియా చీఫ్ అనురాగ్ దండా స్పందించారు. రాఘవ్ కొన్నాళ్లుగా భయపడుతున్నారని, మోదీకి వ్యతిరేకంగా మాట్లాడలేకపోతున్నారని విమర్శించారు. ఆమ్ ఆద్మీ పార్టీలోని వారంతా అరవింద్ కేజ్రీవాల్ సైనికులమని, ఇలాంటి వారు మోదీకి భయపడరని అన్నారు. మోదీకి భయపడేవారు దేశం కోసం పోరాడతారా? అని ప్రశ్నించారు. సభలో మాట్లాడటానికి లభించే కొద్దిపాటి సమయంలో కీలక అంశాలను లేవనెత్తాలని, కానీ రాఘవ్ మాత్రం క్యాంటీన్లలో సమోసాల గురించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గుజరాత్‌లో ఆమ్ ఆద్మీ పార్టీ కార్యకర్తలను అరెస్టు చేస్తే ఆయన మాట్లాడలేదని విమర్శించారు. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు వ్యతిరేకంగా తీసుకొచ్చిన తీర్మానంపై సంతకం చేయడానికి తిరస్కరించారని ఆరోపించారు. పార్టీ సభ్యులు సభ నుంచి వాకౌట్ చేసినా ఆయన మాత్రం సభలోనే ఉన్నారని గుర్తు చేశారు. రాఘవ్ చద్దా ప్రవర్తనతో పార్టీ కార్యకర్తలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు.




### ప్రజా సమస్యలు లేవనెత్తడం నేరమా?: రాఘవ్ చద్దా

రాజ్యసభ డిప్యూటీ లీడర్ పదవి నుంచి తొలగింపుపై రాఘవ్ చద్దా తీవ్రంగా స్పందించారు. పార్లమెంటులో తన గొంతు నొక్కేందుకే ఈ చర్య తీసుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ మేరకు 'ఎక్స్' (ట్విట్టర్)లో పోస్ట్ చేసిన ఒక వీడియో సందేశంలో ఆయన తన ఆవేదన వ్యక్తం చేశారు. "నేను పార్లమెంటులో మాట్లాడే అవకాశం వచ్చినప్పుడల్లా ప్రజా సమస్యలను లేవనెత్తుతాను. బహుశా సాధారణంగా ఎవరూ ప్రస్తావించని అంశాలను నేను చర్చిస్తాను. కానీ, ప్రజా సమస్యలను లేవనెత్తడం నేరమా? నేను ఏదైనా తప్పు చేశానా? ఏదైనా పొరపాటు జరిగిందా?" అని చద్దా ప్రశ్నించారు. "రాజ్యసభలో రాఘవ్ చద్దాను మాట్లాడకుండా ఆపాలని పార్టీ సెక్రటేరియట్‌కు చెప్పినందునే నేను ఈ ప్రశ్న అడుగుతున్నాను" అని ఆయన పేర్కొన్నారు. "మౌనంగా ఉన్నా, ఓడిపోలేదు" అనే సందేశంతో ఈ వీడియోను విడుదల చేశారు. గురువారం జరిగిన నాటకీయ పరిణామాల తర్వాత చద్దా ఈ వ్యాఖ్యలు చేశారు. రాజ్యసభలో ఆయనకు మాట్లాడే అవకాశం (ఫ్లోర్ టైమ్) ఇవ్వవద్దని కోరుతూ పార్టీ ఆయనను డిప్యూటీ లీడర్ పదవి నుంచి తొలగించినట్లు వార్తలు వచ్చాయి. తనను మాట్లాడకుండా చేసేందుకే డిప్యూటీ లీడర్ పదవి నుంచి తొలగించారని, తద్వారా ఆయన తనకు తానుగా సమయం కేటాయించుకోలేరని చద్దా సన్నిహిత వర్గాలు తెలిపాయి. ఒకప్పుడు ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌కు అత్యంత సన్నిహితుడిగా, పార్టీలో కీలక నేతగా భావించిన రాఘవ్ చద్దా భవిష్యత్తుపై ఈ పరిణామంతో ఊహాగానాలు మొదలయ్యాయి. అయితే, చద్దాను ఎందుకు తొలగించారనే దానిపై ఆప్ ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి వివరణ ఇవ్వలేదు. లిక్కర్ పాలసీ కేసులో కేజ్రీవాల్, మనీశ్ సిసోడియాలకు క్లీన్ చిట్ వచ్చిన సమయంలో ఇతర కీలక పార్టీ కార్యక్రమాలకు చద్దా దూరంగా ఉండటమే దీనికి కారణమని రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. అయితే, ఇటీవల రాజ్యసభలో విమానాశ్రయాల్లో అధిక ధరలు, గిగ్ వర్కర్ల హక్కులు, నగరాల్లో ట్రాఫిక్ రద్దీ వంటి ముఖ్యమైన అంశాలను చద్దా ప్రస్తావిస్తూ చురుగ్గా ఉన్నారు. తనను పదవి నుంచి తొలగించారనే వార్త వచ్చిన కొన్ని గంటల తర్వాత పార్లమెంటులో తాను చేసిన ప్రసంగాల హైలైట్స్ వీడియోను 'ఎక్స్' లో పోస్ట్ చేశారు. దీనికి చెడు దృష్టి తగలకుండా వాడే 'నజర్ బొన్‌కుగు' ఎమోజీని జోడించడం గమనార్హం. 2012లో పార్టీ స్థాపించినప్పటి నుంచి చద్దా ఆప్‌తో అనుబంధం కొనసాగిస్తున్నారు. ఆయన స్థానంలో మరో ఎంపీ అశోక్ మిట్టల్‌ను డిప్యూటీ లీడర్‌గా నియమించారు. సభలో పార్టీ నేతగా సంజయ్ సింగ్ కొనసాగుతారు.

# 4 గంటలకే ఆఫీస్ క్లోజ్

## ఇంధన కొరతతో బంగ్లాదేశ్ కీలక నిర్ణయాలు

ఢాకా: ఇంధన కొరత కారణంగా బంగ్లాదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇంధన కొరత కొనసాగుతున్నందున దుకాణాలు, షాపింగ్ మాల్స్, బ్యాంకులు, కార్యాలయాల పని సమయాన్ని కుదిస్తూ బంగ్లాదేశ్ ప్రధాని తారిఖ్ రెహ్మాన్ నేతృత్వంలో నిర్వహించిన మంత్రి వర్గ సమావేశం నిర్ణయించింది. అన్ని దుకాణాలు, షాపింగ్ మాల్స్ సాయంత్రం 6 గంటలకే మూసివేయాలని ఆదేశాలు జారీ చేసింది. కార్యాలయాల్లో పని గంటలను కూడా గంట తగ్గించింది. ఇక మీదట సాయంత్రం ఐదు గంటలకు బదులు 4 గంటలకు కార్యాలయాలు మూసివేయాలని ఆదేశించింది. బ్యాంకింగ్ లావాదేవీలు కూడా ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకే నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు బ్యాంకులు మూతబడనున్నాయి. అయితే హోటళ్లు, ఫార్మసీలు, అత్యవసర సేవలు, నిత్యావసర వస్తు మార్కెట్లకు మాత్రమే ఈ ఆంక్షల నుంచి మినహాయింపు ఉంది. ప్రస్తుత క్లిష్ట పరిస్థితుల్లో బంగ్లాదేశ్‌కు భారత్ 5,000 టన్నుల డీజిల్‌ను సరఫరా చేసింది. రాబోయే నాలుగు నెలల్లో 50,000 మెట్రిక్ టన్నుల డీజిల్‌ను సరఫరా చేయాలని భారత ప్రభుత్వాన్ని బంగ్లాదేశ్ అభ్యర్థించింది. ఆ దేశ విన్నపాన్ని పరిశీలిస్తున్నట్లు భారత్ తెలిపింది.

# చైనా భారీ రాకెట్ ప్రయోగం విఫలం



బీజింగ్: చైనా సొంతంగా అభివృద్ధి చేసిన అత్యంత శక్తివంతమైన రాకెట్ ప్రయోగం విఫలమైంది. దీనితో వాణిజ్య అంతరిక్ష పరిశోధన ప్రయోగాల్లో చైనాకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రైవేటుగా అభివృద్ధి చేసిన శక్తిమంతమైన తియాన్‌లాంగ్-3 ప్రయోగం సాంకేతిక లోపం కారణంగా విఫలమైంది. ఇది నిర్దేశిత కక్ష్యలోకి వెళ్లలేకపోయినట్లు సంబంధిత సంస్థ తెలిపింది. బీజింగ్‌కు చెందిన స్పేస్ పయనీర్ అనే ప్రైవేటు సంస్థ 'స్పేస్ ఎక్స్' ఫాల్కన్9కు పోటీగా ఈ భారీ రాకెట్‌ను అభివద్ధి చేసింది. దీనిని ఈరోజు డాంగ్‌ఫెంగ్ కమర్షియల్ ఏరోస్పేస్ ఇన్నోవేషన్ కేంద్రం నుంచి ప్రయోగించగా, నింగిలోకి దూసుకెళ్లిన కొన్ని నిమిషాల్లోనే విఫలమైంది. ఇది ఫెయిల్ కావడానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నట్లు స్పేస్ పయనీర్ వెల్లడించింది. తదుపరి మిషన్ విజయవంతమయ్యేలా కృషి చేస్తామని తెలిపింది.

# విజయ్ అఫిడవిట్లలో విభిన్న సమాచారం!

చెన్నై: తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో నటుడు, టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ రెండు నియోజకవర్గాల నుంచి పోటీ చేస్తున్నారు. ఆయన పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ స్థానాల్లో నామినేషన్ దాఖలు చేశారు. ఆయన రెండుచోట్ల దాఖలు చేసిన ఎన్నికల అఫిడవిట్‌లలో తేడాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఎన్నికలకు ముందు ఈ వ్యవహారం న్యాయపరిశీలకు దారి తీసే అవకాశం ఉందనే వాదనలు వినిపిస్తున్నాయి. పెరంబూర్, తిరుచ్చి ఈస్ట్ అసెంబ్లీ స్థానాల కోసం రూపొందించిన అఫిడవిట్‌లలో పెండింగ్ క్రిమినల్ కేసులు, ఎన్నికల బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాల్లో తేడాలు ఉన్నట్లు తెలుస్తోంది. పెరంబూర్ ఎన్నికల అఫిడవిట్‌లో తనపై ఎలాంటి కేసులు లేవని పేర్కొన్న విజయ్, తిరుచ్చి ఈస్ట్ కోసం సమర్పించిన అఫిడవిట్‌లో పెండింగ్‌లో రెండు ఎఫ్ఐఆర్‌లు ఉన్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ఖర్చు కోసం ఒక బ్యాంకు ఖాతాను తెరిచామని, ఇందులో రూ.1 లక్ష ఉన్నట్లు పెరంబూర్ అఫిడవిట్లో పేర్కొన్న విజయ్, తిరుచ్చి అఫిడవిట్లో రెండు బ్యాంకు ఖాతాలు ఉన్నట్లు తెలిపారు.

# ఐఏఎస్ కుమారుడికి డ్రగ్స్ పాజిటివ్

కొండాపూర్-హైదరాబాద్, ఏప్రిల్ 3 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని కొండాపూర్ క్వాక్ ఏరీనా పబ్‌లో డ్రగ్స్ కలకలం చెలరేగింది. 64 మందికి పరీక్షలు నిర్వహించగా ఆరుగురికి గంజాయి పాటిజివ్, ఇద్దరికి డ్రగ్స్ పాటిజివ్ వచ్చింది. పాజిటివ్ వచ్చిన ఎనిమిది మందిలో ఒకరు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మహిళా ఐఏఎస్ అధికారి కుమారుడు కూడా ఉన్నారని తెలుస్తోంది. పోలీసులు వీరిని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. క్వాక్ ఎరీనా పబ్ డ్రగ్ కేసులో పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. క్వాక్ ఎరీనా క్లబ్‌లో 'బ్లాక్ కాఫీ' పేరిట ఈవెంట్ జరిగింది. ఈవెంట్‌లో దాదాపు 1,500 మంది పాల్గొన్నారు. ఈ సమయంలో అక్కడకు వచ్చిన ఈగల్ టీమ్ అధికారులు డ్రగ్ పరీక్షలు నిర్వహించారు. 'బ్లాక్ కాఫీ' ఈవెంట్ జరుగుతున్న చోటుకు వెళ్లి పరీక్షలు నిర్వహించగా ఎనిమిది మందికి పాజిటివ్ వచ్చింది. క్వాక్ ఎరీనా క్లబ్ పబ్ ఈవెంట్ లో ప్రముఖ సినీ నటి హేమ కూడా పాల్గొన్నారు. పరీక్షల్లో ఆమెకు నెగిటివ్ వచ్చింది. తనకు డ్రగ్ పరీక్షల్లో నెగిటివ్ వచ్చినట్లు నిర్ధారించిన కిట్‌ను ఆమె చూపిస్తూ వీడియో విడుదల చేశారు.

# ఇరాన్ నౌక భారత్‌కు.. కాదు చైనాకు!

న్యూఢిల్లీ: దాదాపు ఏడేళ్ల విరామం తర్వాత ఇరాన్ నుంచి ముడిచమురుతో భారత్‌కు వస్తున్న ఓ ట్యాంకర్, చివరి నిమిషంలో తన గమ్యాన్ని చైనాకు మార్చుకుంది. చెల్లింపులకు సంబంధించిన సమస్యల కారణంగానే ఈ పరిణామం చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే... అమెరికా ఆంక్షలు ఎదుర్కొంటున్న 'పింగ్ షున్' అనే నౌక.. ఇరాన్ ముడి చమురుతో గుజరాత్‌లోని వాడినార్ ఓడరేవుకు రావాల్సి ఉంది. అయితే, ప్రయాణ మధ్యంలో తన మార్గాన్ని మార్చుకుని, ప్రస్తుతం చైనాలోని డాంగింగ్ రేవుకు వెళుతున్నట్లు షిప్-ట్రాకింగ్ సంస్థ కెప్లర్ వెల్లడించింది. ఈ నెల 4 నాటికి ఈ నౌక వాడినార్‌కు చేరుకోవాల్సి ఉండగా ఈ మార్పు జరిగింది. చెల్లింపుల విషయంలో నిబంధనలు కఠినతరం కావడమే ఇందుకు ప్రధాన కారణమని కెప్లర్ విశ్లేషకుడు సుమిత్ రిటోలియా అభిప్రాయపడ్డారు. గతంలో మాదిరిగా 30-60 రోజుల క్రెడిట్ కాకుండా, ఇప్పుడు వెంటనే డబ్బు చెల్లించాలని అమ్మకందారులు కోరుతున్నట్లు సమాచారం. ఈ నౌకలో సుమారు 6 లక్షల బ్యారెళ్ల ముడి చమురు ఉన్నట్లు అంచనా. ఇరాన్‌పై అమెరికా ఇటీవల ఆంక్షలను తాత్కాలికంగా సడలించడంతో భారత రిఫైనరీలు అక్కడి నుంచి చమురు కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపాయి. ఈ నేపథ్యంలోనే 'పింగ్ షున్' నౌక భారత్‌కు బయలుదేరింది. ఒకప్పుడు భారత్, ఇరాన్ నుంచి అత్యధికంగా చమురు దిగుమతి చేసుకునేది. అయితే, 2019 మే నుంచి అమెరికా ఆంక్షల కారణంగా దిగుమతులు పూర్తిగా నిలిచిపోయాయి. ఇప్పుడు మళ్లీ మొదలవుతాయనుకున్న ప్రక్రియకు తాత్కాలికంగా బ్రేక్ పడినట్లయింది.

# పెళ్లి కోసం బరువు తగ్గే ఇంజెక్షన్లు!

న్యూఢిల్లీ: పెళ్లి రోజున నాజూగ్గా, అందంగా కనిపించాలనే ఆశ ప్రతి వధువుకూ ఉంటుంది. ఈ ఆశే ఇప్పుడు భారతదేశంలో ఒక కొత్త ట్రెండ్‌కు దారితీస్తోంది. పెళ్లికి ముందు వేగంగా బరువు తగ్గేందుకు కాబోయే వధూవరులు 'మౌంజారో' వంటి బరువు తగ్గించే ఇంజెక్షన్లను ఆశ్రయిస్తున్నారు. న్యూఢిల్లీకి చెందిన 'క్లారిటీ స్కిన్ క్లినిక్' ఏకంగా "మౌంజారో బ్రైడ్" పేరుతో ప్రత్యేక ప్యాకేజీని ప్రచారం చేస్తోంది. మరికొన్ని క్లినిక్‌లు కూడా చర్మ, కేశ సంరక్షణతో పాటు ఈ ఇంజెక్షన్లను ప్రీ-వెడ్డింగ్ ప్యాకేజీల్లో చేర్చుతున్నాయి. ఎలి లిల్లీ సంస్థకు చెందిన మౌంజారో ఔషధం గురించి తమకు విచారణలు పెరిగాయని పలువురు వైద్యులు చెబుతున్నారు. గత కొన్ని నెలలుగా ఊబకాయం తగ్గించే ఇంజెక్షన్ల కోసం వస్తున్న విచారణల్లో 20 శాతానికి పైగా కాబోయే వధువుల నుంచే వస్తున్నాయని ఢిల్లీకి చెందిన బారియాట్రిక్ సర్జన్ డాక్టర్ రజత్ గోయల్ తెలిపారు. వైద్యపరంగా అర్హత ఉన్నవారికే తాము ఈ మందులను సూచిస్తున్నామని ఆయన స్పష్టం చేశారు. వ్యాయామం, డైటింగ్ చేసినా ఫలితం లేకపోవడంతో, ముంబై26 ఏళ్లఅదితి తన పెళ్లికి ముందు మౌంజారో వాడి 10 కిలోల బరువు తగ్గింది. పెళ్లి సమయంలో ఆత్మవిశ్వాసంతో ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆమె చెప్పింది. బరువు విషయంలో ఎదురయ్యే సామాజిక ఒత్తిడి కూడా చాలా మందిని ఈ వైపు నడిపిస్తోంది. భారత్‌లో డయాబెటిస్, బరువు తగ్గడం కోసం అనుమతి పొందిన తొలి జీఎల్‌పీ-1 ఔషధం మౌంజారో. అయితే, వీటిని తక్షణ పరిష్కారంగా చూడవద్దని, కేవలం వైద్యుల పర్యవేక్షణలోనే వాడాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మరోవైపు, ఈ మందుల దుర్వినియోగం, అనధికార అమ్మకాలపై డ్రగ్ రెగ్యులేటర్ ఆందోళన వ్యక్తం చేస్తోంది.

## విదేశీ మందులపై ట్రంప్

# 100 శాతం సుంకం

### భారత కంపెనీలపై దీర్ఘకాలిక ప్రభావం పడే చాన్స్





వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. దేశీయ భద్రత, సరఫరా వ్యవస్థలో ఎదురవుతున్న సమస్యలను కారణంగా చూపుతూ.. విదేశాల నుంచి దిగుమతి అయ్యే కొన్ని పేటెంట్ ఔషధాలపై 100 శాతం వరకు సుంకాలు విధిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు. అమెరికాలోనే మందుల తయారీని ప్రోత్సహించడమే ఈ నిర్ణయం వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. ఈ పరిణామం ప్రపంచ ఫార్మా మార్కెట్‌తో పాటు, భారత కంపెనీల భవిష్యత్తుపైనా ఆందోళన కలిగిస్తోంది. ట్రంప్ జారీ చేసిన ఆదేశాల ప్రకారం విదేశాల నుంచి దిగుమతి అయ్యే పేటెంట్ లేదా బ్రాండెడ్ ఔషధాలపై 100 శాతం వరకు టారిఫ్‌లు వర్తిస్తాయి. అయితే, అమెరికా ప్రభుత్వంతో "మోస్ట్ ఫేవర్డ్ నేషన్" ధరల ఒప్పందం కుదుర్చుకుని, అమెరికాలో తయారీ యూనిట్లను నిర్మిస్తున్న కంపెనీలకు సుంకాల నుంచి పూర్తి మినహాయింపు లభిస్తుంది. ధరల ఒప్పందం చేసుకోకపోయినా, అమెరికాలో తయారీ ప్రాజెక్టులు చేపడుతున్న కంపెనీలకు 20 శాతం సుంకం విధిస్తారు. నాలుగేళ్లలో ఈ సుంకం 100 శాతానికి పెరుగుతుంది. ఒప్పందాలు చేసుకోని పెద్ద కంపెనీలకు 120 రోజులు, ఇతర కంపెనీలకు 180 రోజుల గడువు ఇచ్చారు. ఈ లోపు ఒప్పందాలు చేసుకోకపోతే 100 శాతం సుంకాలు అమల్లోకి వస్తాయి. ఇప్పటికే 17 ప్రముఖ ఫార్మా కంపెనీలతో ధరల ఒప్పందాలు కుదిరినట్లు, వాటిలో 13 కంపెనీలు సంతకాలు చేసినట్లు వైట్‌హౌస్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం అమెరికాలో పంపిణీ అవుతున్న పేటెంట్ ఔషధాల్లో దాదాపు 53 శాతం విదేశాల్లోనే తయారవుతున్నాయని, కేవలం 15 శాతం యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్ (ఏపీఐ) మాత్రమే దేశీయంగా ఉత్పత్తి అవుతున్నాయని ప్రభుత్వం పేర్కొంది. అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో అంతరాయాలు ఏర్పడితే, ప్రాణాలను రక్షించే మందుల కొరత ఏర్పడవచ్చని ఆందోళన వ్యక్తం చేసింది. క్యాన్సర్, అరుదైన వ్యాధులు, ఆటో ఇమ్యూన్ సమస్యల చికిత్సలో వాడే కీలక ఔషధాల కోసం దేశీయంగానే పటిష్ఠమైన తయారీ వ్యవస్థ ఉండాలని ట్రంప్ ప్రభుత్వం వాదిస్తోంది. ప్రస్తుతానికి ఈ ఆదేశాల వల్ల భారత ఫార్మా రంగానికి తక్షణ ముప్పు లేదు. ఎందుకంటే, జెనరిక్ మందుల తయారీలో భారత్ ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉంది. ట్రంప్ ఆదేశాల నుంచి జెనరిక్స్, బయోసిమిలర్స్, అత్యవసర మందులకు మినహాయింపు ఇచ్చారు. దీంతో అమెరికాకు తక్కువ ధరకే మందులను ఎగుమతి చేస్తున్న భారత కంపెనీల వ్యాపారం యథావిధిగా కొనసాగనుంది. అయితే, దీర్ఘకాలంలో దీని ప్రభావం తీవ్రంగా ఉండే అవకాశం ఉంది. పేటెంట్ మందులు, ఏపీఐలపై భారీ సుంకాలు విధించడం వల్ల భవిష్యత్తులో పెట్టుబడులు అమెరికాకు తరలిపోయే ప్రమాదం ఉంది. భారత్ వంటి తయారీ కేంద్రాల నుంచి కంపెనీలు తమ కార్యకలాపాలను అమెరికాకు మార్చేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. అంతేగాక ఏడాది తర్వాత జెనరిక్ దిగుమతులపై కూడా జాతీయ భద్రత కోణంలో సమీక్ష జరుపుతామని వైట్‌హౌస్ స్పష్టం చేసింది. ఇది అమలైతే కాంప్లెక్స్ జెనరిక్స్, స్పెషాలిటీ ఇంజెక్టబుల్స్, బయోసిమిలర్స్‌పై ప్రభావం పడుతుంది. డాక్టర్ రెడ్డీస్, సన్ ఫార్మా, బయోకాన్ వంటి భారతీయ కంపెనీలు అమెరికాలో పేటెంట్ మందులను విక్రయిస్తున్నందున, భవిష్యత్తులో ధరల ఒత్తిడిని లేదా మరిన్ని నిబంధనలను ఎదుర్కోవచ్చు.

# మీరా మాకు నీతులు చెప్పేది?

## రేవంత్ రెడ్డిపై విజయన్ ఫైర్



తిరువనంతపురం: తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల కేరళలో ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆ రాష్ట్ర సర్కారుపై చేసిన విమర్శనాత్మక వ్యాఖ్యలపై ముఖ్యమంత్రి పినరయి విజయన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రేవంత్ ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, వాస్తవాలను తెలుసుకోకుండా మాట్లాడటం సరికాదని హితవు పలికారు. సొంత రాష్ట్రంలో పేదల ఇళ్లపై బుల్డోజర్లు నడిపే వ్యక్తి, సామాజిక పురోగతి గురించి కేరళకు పాఠాలు చెప్పడానికి ప్రయత్నించడం విడ్డూరంగా ఉందని ఆయన ఎద్దేవా చేశారు. కేరళ సాధిస్తున్న సుస్థిర, సమ్మిళిత అభివృద్ధిని దెబ్బతీయాలనుకునే వారికి రేవంత్ రెడ్డి ఒక గొంతుకగా మారారని విజయన్ ఆరోపించారు. కేరళలో అవినీతి, దుష్పరిపాలన ఉందని ఆరోపించే ముందు రేవంత్ రెడ్డి అధికారిక గణాంకాలను పరిశీలించాలని పినరయి విజయన్ సూచించారు. "దేశంలోనే అత్యంత తక్కువ అవినీతి ఉన్న రాష్ట్రం కేరళ అని ఆయనకు తెలియదా? నీతి ఆయోగ్ ఎస్‌డీజీ ఇండెక్స్ (2023-24)లో కేరళ 79 పాయింట్లతో మొదటి స్థానంలో ఉంటే, తెలంగాణ ఆరో స్థానంలో ఉంది. మీ రాష్ట్రంలోని లోపాలను కప్పిపుచ్చుకోవడానికి కేరళను కించపరచడం చాలా విచారకరం" అని విజయన్ అన్నారు. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారమే కేరళలో పేదరికపు రేటు కేవలం 0.55 శాతం అని, ఇది దేశంలోనే అత్యల్పమని గుర్తుచేశారు. 2025 చివరి నాటికి తీవ్ర పేదరికాన్ని పూర్తిగా నిర్మూలించిన తొలి రాష్ట్రంగా కేరళ నిలవబోతోందని తెలిపారు. అదే సమయంలో తెలంగాణలో పేదరికం 5.88 శాతంగా ఉందని, అక్కడి నిరుపేదలను ఆదుకోవాలనే ఆలోచన ప్రభుత్వానికి లేదా? అని ప్రశ్నించారు. అంతేకాకుండా, కేరళలో అక్షరాస్యత 95.3 శాతం ఉండగా, తెలంగాణలో 76.9 శాతం వద్దే ఆగిపోయిందని విజయన్ చురకలంటించారు. కేరళలో శిశు మరణాల రేటు (ఐఎంఆర్) కేవలం 5గా ఉందని, ఇది అమెరికా (5.6) కన్నా మెరుగని పేర్కొన్నారు. కానీ తెలంగాణలో ఈ రేటు దాదాపు నాలుగు రెట్లు ఎక్కువగా ఉందని విమర్శించారు. తమ ప్రభుత్వ పాలనా నమూనాను రేవంత్ రెడ్డి విమర్శించడం ద్వంద్వ వైఖరికి నిదర్శనమని అన్నారు. "2025 సెప్టెంబర్ 1న, తెలంగాణకు చెందిన రెవెన్యూ, సర్వే ఉన్నతాధికారుల బృందం తిరువనంతపురం వచ్చి మా డిజిటల్ ల్యాండ్ రికార్డ్ సిస్టమ్ 'ఎంతే భూమి'ని అధ్యయనం చేసింది. ఒకవైపు మీ అధికారులు మా నమూనాను నేర్చుకోవడానికి వస్తుంటే, మరోవైపు మీరు బహిరంగంగా ఎగతాళి చేయడం ఎంతవరకు సమంజసం?" అని రేవంత్ రెడ్డిని విజయన్ ప్రశ్నించారు. కేరళ, కేంద్ర ప్రభుత్వాల మధ్య లాలూచీ ఉందని రేవంత్ చేసిన ఆరోపణను విజయన్ కొట్టిపారేశారు. కేరళ అభివృద్ధిని అడ్డుకునేందుకు కేంద్రం విధిస్తున్న ఆర్థిక ఆంక్షలపై, అప్పుల పరిమితిపై ఒక్క మాట కూడా మాట్లాడని కాంగ్రెస్ పార్టీయే బీజేపీకి నిజమైన 'బీ-టీమ్' అని ఆరోపించారు. ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు పదేపదే ఆలస్యం చేసే ప్రభుత్వం నడుపుతున్న ముఖ్యమంత్రి, కేరళకు నేర్పడానికి ఏమీ లేదని అన్నారు. పాలన, ప్రజా సంక్షేమం గురించి నిజమైన పాఠాలు నేర్చుకోవాలంటే తెలంగాణ ముఖ్యమంత్రిని కేరళకు సాదరంగా ఆహ్వానిస్తున్నామని పినరయి విజయన్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

# ఒక్క దెబ్బకు 8 టార్గెట్లు

## గల్ఫ్ దేశాలను వణికిస్తున్న ఇరాన్ హిట్‌లిస్ట్

టెహ్రాన్: ఇరాన్‌లోని అతిపెద్ద, అత్యంత కీలకమైన వంతెనను అమెరికా ధ్వంసం చేసిందన్న వార్తల నేపథ్యంలో.. ప్రతీకార చర్యలకు దిగుతామంటూ టెహ్రాన్ తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఈ క్రమంలో గల్ఫ్ దేశాల్లోని 8 ప్రధాన వంతెనలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఓ 'హిట్‌లిస్ట్'ను విడుదల చేసింది. ఇరాన్‌లోని బీ1 వంతెనపై అమెరికా దాడులు జరిపిందని, అది కూలిపోయిందని వార్తలు వచ్చాయి. ఈ ఘటన తర్వాత అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ "ఇంకా ముందుంది" అని హెచ్చరించడం ఉద్రిక్తతలను మరింత పెంచింది. దీనికి ప్రతిస్పందనగానే ఇరాన్ ప్రభుత్వ మీడియా ఈ హిట్‌లిస్ట్‌ను ప్రకటించింది. ఇరాన్ లక్ష్యంగా చేసుకున్న వంతెనల జాబితాలో గల్ఫ్ ప్రాంతంలోని అత్యంత వ్యూహాత్మకమైన నిర్మాణాలు ఉన్నాయి. వాటిలో సౌదీ అరేబియా-బహ్రెయిన్‌లను కలిపే కింగ్ ఫహద్ కాజ్‌వే, అబుదాబిలోని షేక్ జాయెద్ బ్రిడ్జ్, దోహాలోని కతారా బ్రిడ్జ్, కువైట్‌లోని షేక్ జాబర్ అల్-అహ్మద్ అల్-సబా కాజ్‌వే ఉన్నాయి. వీటితో పాటు ఒమన్, ఇతర గల్ఫ్ దేశాల్లోని మరికొన్ని కీలక వంతెనలు కూడా ఈ జాబితాలో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ వంతెనలపై దాడి జరిగితే గల్ఫ్ దేశాల మధ్య రవాణా వ్యవస్థ స్తంభించిపోవడమే కాకుండా ప్రపంచ చమురు సరఫరా, ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అమెరికా తమ మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుంటే, తాము కూడా గల్ఫ్‌లోని అమెరికా మిత్రదేశాల వంతెనలను ధ్వంసం చేస్తామని ఇరాన్ పరోక్షంగా హెచ్చరించినట్లయింది.

# బీజేపీతో కలిస్తే భవిష్యత్తు ఉండదు: కనిమొళి

చెన్నై: బీజేపీతో జట్టు కట్టేవారికి రాజకీయ భవిష్యత్తు ఉండదని డీఎంకే ఎంపీ కనిమొళి అన్నారు. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు దగ్గపడిన విషయం తెలిసిందే. తమిళనాడులో బీజేపీ, అన్నాడీఎంకే పార్టీలు పొత్తు పెట్టుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కనిమొళి స్పందించారు. బీజేపీతో పొత్తు పెట్టుకునే రాజకీయ పార్టీల భవిష్యత్తు అంధకారంగా మారుతుందని హెచ్చరించారు. డీఎంకే హిందూ వ్యతిరేక పార్టీ అంటూ బీజేపీ కూటమి చేస్తున్న ఆరోపణలను ఆమె కొట్టిపారేశారు. అన్నాడీఎంకే తీసుకున్న రాజకీయ నిర్ణయాలు తమిళనాడు, ఇక్కడి ప్రజల ప్రయోజనాలకు భంగం కలిగించాయని అన్నారు. బీజేపీతో పొత్తు పెట్టుకున్న తర్వాత ఏ రాజకీయ పార్టీ కూడా వృద్ధి సాధించినట్లు చరిత్రలో లేదని అన్నారు. బీజేపీ, అన్నాడీఎంకేది మోసపూరిత పొత్తు అని విమర్శించారు. బీజేపీతో పొత్తు ద్వారా అన్నాడీఎంకే తమిళ ప్రజలతో పాటు ఆ పార్టీ కార్యకర్తలను కూడా మోసం చేశారని విమర్శించారు.

లయ్యారి చిత్రం


దేబ్నిశ్రీ బసు

# ధురంధర్ 2 ..రూ.1500 కోట్లు



భారీ విజయాన్ని అందుకుని దూసుకెళ్తున్న ధురంధర్: ది రివెంజ్ మూవీ బాక్సాఫీస్ వద్ద కొత్త చరిత్ర సృష్టిస్తోంది. దర్శకుడు ఆదిత్య ధర్ తెరకెక్కించిన ఆ చిత్రం విడుదలైన రెండు వారాల్లోనే దేశీయంగా రూ.1000 కోట్ల నెట్ మార్క్ కు చేరువ కావడం విశేషం. అంతే కాదు రెండో వారం ముగిసే సరికి ఆ సినిమా భారత్ లో ఏకంగా రూ.961 కోట్ల నెట్ వసూళ్లు సాధించింది. మొదటి వారంలో ధురంధర్ 2 రూ.690 కోట్ల నెట్ కలెక్షన్లు సాధించి రికార్డులు బద్దలు కొట్టింది. రెండో వీకెండ్ లోనూ అదే ఊపు కొనసాగిస్తూ రూ.177 కోట్లు వసూలు చేసింది. వర్కింగ్ డేస్ లో కూడా కలెక్షన్లు స్టేబుల్ గా ఉండటం గమనార్హం. రెండో వారంలో సోమవారం రూ.26 కోట్లు, మంగళవారం రూ.28 కోట్లు, బుధవారం రూ.21 కోట్లు, గురువారం రూ.19 కోట్లు వసూలు చేసి మొత్తం రూ.271 కోట్ల నెట్ సాధించింది. ఇక భారత్ లో మొత్తం గ్రాస్ కలెక్షన్లు రూ.1134 కోట్లకు చేరగా.. విదేశీ మార్కెట్లలో కూడా సినిమా అద్భుత ప్రదర్శన కనబరుస్తోంది. ఓవర్సీస్ లో మొదటి రెండు వారాల్లోనే రూ.367 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా మొత్తం రూ.1501 కోట్ల గ్రాస్ మార్క్ ను దాటింది. ఇంత తక్కువ సమయంలో అన్ని కోట్ల వసూళ్లు సాధించడం అరుదైన ఘనత అని చెప్పాలి.

**మొదటి వారం మొత్తం- రూ.690 కోట్లు (నెట్)**
**రెండో వారం మొత్తం - రూ.271 కోట్లు (నెట్)**
**ఇప్పటి వరకు ఇండియా మొత్తం- రూ.961 కోట్లు (నెట్)**
**భారత్ లో మొత్తం గ్రాస్ కలెక్షన్లు- రూ.1134 కోట్లు**
**ప్రపంచవ్యాప్త గ్రాస్ వసూళ్లు- రూ. 1,501 కోట్లు**



## రామాయణపై నా నిర్ణయం తప్పు: దీపిక చిఖ్లియా

1980వ దశకంలో రామాయణ్ సీరియల్‌లో సీత పాత్రతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ప్రముఖ నటి దీపికా చిఖ్లియా, తొలుత కొత్త రామాయణాల నిర్మాణంపై విమర్శలు చేసిన విషయం తెలిసిందే. అయితే తాజా టీజర్ చూసిన తర్వాత ఆమె తన అభిప్రాయాన్ని పూర్తిగా మార్చుకోవడం గమనార్హం. ఆమె రీసెంట్ గా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో రామాయణ టీజర్‌లోని గ్రాండియర్‌ను ప్రశంసించారు. టీజర్ చాలా అద్భుతంగా ఉందని, విజువల్స్ చాలా రిచ్‌గా కనిపిస్తున్నాయని, ఈ సినిమాను ఎంతో శ్రద్ధతో రూపొందించినట్లు అనిపిస్తోందని, ఈ సినిమాను చూడటానికి ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్టు ఆమె పేర్కొన్నారు. గతంలో రామాయణ కథను పదే పదే తెరపైకి తీసుకురావడాన్ని వ్యతిరేకించిన ఆమె నుంచి వచ్చిన ఈ పాజిటివ్ రెస్పాన్స్ ఇప్పుడు ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారింది. గతంలో దీపికా చిఖ్లియా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. రామాయణాన్ని మళ్లీ మళ్లీ తెరకెక్కించడం వల్ల అందులోని కథా సారాంశం దెబ్బతింటోందంటూ విమర్శించారు. ముఖ్యంగా ప్రభాస్ నటించిన ఆదిపురుష్ సినిమాపై కూడా ఆమె తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. కానీ ఇప్పుడు రామాయణ డైరెక్టర్ నితేష్ తివారీ చూపించిన విజన్, టీజర్‌లో కనిపించిన టెక్నికల్ క్వాలిటీ ఆమె అభిప్రాయాన్ని మార్చినట్లుగా తెలుస్తోంది.

## సాయి దుర్గా తేజ్.. 19!




మెగా సుప్రీం హీరో సాయి దుర్గా తేజ్ తన 19వ చిత్రాన్ని ప్రకటించారు. పాతకాలపు రహస్యాలు, ఊహకు అందని శక్తుల చుట్టూ తిరిగే ఒక సరికొత్త ప్రపంచాన్ని ఈ సినిమా ద్వారా పరిచయం చేయబోతున్నారు. ఇందుకు సంబంధించిన అనౌన్స్‌మెంట్ పోస్టర్ చూస్తుంటే, సాయి తేజ్ ఈసారి ఒక భారీ విజువల్ ఎంటర్టైనర్ తో రాబోతున్నట్లు అర్థమవుతోంది. ఇప్పటికే 'క' చిత్రంతో తమ ప్రతిభను చాటుకున్న సుజిత్, సందీప్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాలో వారు చూపించిన టెక్నికల్ వాల్యూస్ అందరినీ మెప్పించాయి. ఇప్పుడు సాయి తేజ్ తో కలిసి మైథిక్ సైన్స్ ఫిక్షన్ జోనర్ లో అంతకు మించిన స్థాయిలో ఒక పవర్ఫుల్ కథను సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. ఈ కలయిక బాక్సాఫీస్ వద్ద ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ భారీ ప్రాజెక్టును నిర్మిస్తున్నారు. వరుస సక్సెస్ లతో దూసుకుపోతున్న ఈ నిర్మాణ సంస్థ, ఎక్కడా రాజీ పడకుండా భారీ బడ్జెట్ తో ఈ సినిమాను రూపొందిస్తోంది. పోస్టర్‌లో ఒక యోధుడు భారీ గ్రహశకలం ముందు నిలబడి ఉండటం చూస్తుంటే, కథాంశం చాలా లోతుగా ఉంటుందనిపిస్తోంది. ఇది కేవలం యాక్షన్ సినిమా మాత్రమే కాకుండా, ప్రేక్షకులకు ఒక గ్రేట్ విజువల్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా ప్లాన్ చేస్తున్నారు.



## షాక్ ఇచ్చిన రష్మిక

స్టార్ హీరోయిన్, నేషనల్ క్రష్ రష్మిక మందన్న చేసిన తాజా సోషల్ మీడియా పోస్ట్ నెట్టింట పెద్ద చర్చకు దారితీసింది. ఆమె షేర్ చేసిన ఒక చిన్న యానిమేషన్ వీడియోతో అభిమానులు గందరగోళానికి గురయ్యారు. ముఖ్యంగా ఇప్పుడు మేము ముగ్గురం అయ్యామంటూ ఇచ్చిన క్యాప్షన్ చుట్టూ రకరకాల ఊహాగానాలు మొదలయ్యాయి. ఇటీవల హీరో విజయ్ దేవరకొండను వివాహం చేసుకున్న రష్మిక.. పెళ్లి తర్వాత కూడా సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ అభిమానులతో టచ్ లో ఉన్నారు. పెళ్లి ఫోటోలు, వీడియోలు ఇప్పటికీ ట్రెండ్ అవుతుండగా, ఈ కొత్త పోస్ట్ మాత్రం మరింత ఆసక్తిని రేకెత్తించింది. యానిమేషన్ వీడియోలో రష్మిక, విజయ్ కార్టూన్ రూపంలో కనిపిస్తారు. వీరి మధ్యలో ఒక చిన్న పొద్దుతిరుగుడు పువ్వు (సన్ ఫ్లవర్) ఉండటం ప్రత్యేకంగా కనిపించింది. ఆ వీడియో చూసిన వెంటనే అభిమానులు తమదైన అర్థాలు చేసుకోవడం ప్రారంభించారు. కొందరు ఇది గుడ్ న్యూస్ కు సిగ్నలా? రష్మిక ప్రెగ్నెంటా? అంటూ సందేహాలు వ్యక్తం చేస్తే, మరికొందరు క్యూట్ కాన్సెప్ట్ అంటూ ప్రశంసించారు. అయితే, అసలు విషయం మాత్రం వేరేలా ఉంది. ఆ పోస్ట్ కు ప్రెగ్నెన్సీతో ఎలాంటి సంబంధం లేదని స్పష్టమవుతోంది. రష్మిక చాలా కాలంగా రూ అనే పొద్దుతిరుగుడు పువ్వు క్యారెక్టర్ తో ఒక ప్రత్యేక యానిమేషన్ ప్రపంచాన్ని నిర్మిస్తోంది.

## గిరిగీసుకొని కూర్చోవద్దు: సనా షేక్



తన టాలెంట్ తో బాలీవుడ్ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి ఫాతిమా సనా షేక్ మరోసారి తన అభిప్రాయాలతో వార్తల్లో నిలిచారు. దంగల్ మూవీలో గీతా ఫోగట్ పాత్రతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన ఆమె, ప్రస్తుతం తన కెరీర్ ఎంపికల విషయంలో స్పష్టమైన దృక్పథంతో ముందుకు సాగుతున్నారు. తాజాగా ఆమె మాట్లాడుతూ, కేవలం కెరీర్ గురించే కాకుండా, జీవితం గురించి కూడా ఆమె తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఎవరైనా తమ ఉద్యోగానికి మాత్రమే పరిమితం కాకూడదని, మన గురించి మనం తెలుసుకోవడం కూడా చాలా ముఖ్యమేనని చెప్పారు. ఈ వ్యాఖ్యలు యూత్‌కు ఒక స్పష్టమైన మెసేజ్‌ను ఇస్తున్నాయి. వ్యక్తిగత అభివృద్ధి, కొత్త విషయాలు నేర్చుకోవడం ఎంత ముఖ్యమో ఆమె ఈ సందర్భంగా వెల్లడించారు.

## రిసార్ట్ కు రమ్మన్నారు: పికు నెమలి



సోషల్ మీడియాతోపాటు సినీ వర్గాల్లో క్యాస్టింగ్ కౌచ్ పై ఇప్పుడు మరోసారి చర్చలు మొదలయ్యాయి. ఒక తెలుగు ఇన్ ఫ్లుయెన్సర్ చేసిన తీవ్ర ఆరోపణలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆమె మాట్లాడిన వీడియో కూడా నెట్టింట చక్కర్లు కొడుతోంది. దీంతో వెంటనే స్పందించిన యాంకర్ ఝాన్సీ.. ఫిర్యాదు చేయాలని సూచించారు. న్యూయార్క్ కు చెందిన పికు నెమలి అనే ఇన్ స్టాగ్రామ్ యూజర్ నేమ్ తో ఉన్న ఓ ఎన్నారై తెలుగు యువతి, ఇటీవల తనకు ఎదురైన అనుభవాలు వీడియో రూపంలో పంచుకుంది. తెలుగు చిత్ర పరిశ్రమలో అవకాశాల కోసం ప్రయత్నించే క్రమంలో తాను ఎదుర్కొన్న పరిస్థితులు ఆమె వివరించింది. తనకు తెలిసిన వారి ద్వారా ఒక అసిస్టెంట్ డైరెక్టర్ తో పరిచయం ఏర్పడినట్లు తెలిపారు. అయితే తాను నటిగా అవకాశాలు దక్కించుకోవాలనే ఉద్దేశంతో తన ఫోటోలు, పోర్ట్ ఫోలియోను ఆ వ్యక్తికి పంపారట. ఆ ప్రక్రియలో వారి మధ్య ఫోన్ సంభాషణ కూడా జరిగినట్లు పేర్కొన్నారు. ఆ సమయంలో తాను సినీ ఇండస్ట్రీపై పూర్తి ఆసక్తి ఉన్నట్లు తెలియజేశానని చెప్పింది. ఆ తర్వాత జరిగిన పరిణామాలు తనను కలచివేశాయని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.



## సార్‌తో సంయుక్త మళ్లీ మళ్లీ..!

మాలీవుడ్ ముద్దుగుమ్మ సంయుక్త మీనన్ సౌత్ లో అన్ని భాషల్ని దున్నేస్తోన్న సంగతి తెలిసిందే. తెలుగ, తమిళం, మలయాళం అంటూ మూడు భాషల్లోనూ బిజీగా కొనసాగుతుంది. వరుస విజయాలు కూడా కలిసొస్తున్నాయి. దీంతో అమ్మడు గోల్డెన్ లెగ్ గా మారిపోయింది. కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ సరసన సార్ చిత్రంలోనూ అమ్మడు నటించిన సంగతి తెలిసిందే. అందులో టీచర్ పాత్రలో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. సినిమాలో ఇద్దరి మధ్య కెమిస్ట్రీ ప్రేక్షకుల్ని ఆకట్టుకుంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో సంయుక్త ధనుష్‌పై ఉన్న గౌరవాన్ని, అభిమానాన్ని మరోసారి చాటుకుంది. ధనుష్‌తో పని చేయడం తను ఎంతో నేర్పించిందంది. ఆయనతో కలిసి నటించే అవకాశం వస్తే ఎన్నిసార్లు అయినా? ఎన్ని సినిమాలైనా చేయడానికి సిద్దంగా ఉన్నట్లు తెలిపింది. ధనుష్ వంటి జాతీయ అవార్డు గ్రహీతతో స్క్రీన్ షేర్ చేసుకోవడం ఏ నటికైనా గర్వకారణమని ఆయన సెట్స్‌లో ఇచ్చే సలహాలు, నటనలో చూపే పరిణతి తనను ఎంతో ప్రభావితం చేసాయంది. సార్ షూటింగ్ సమయంలో తమ మధ్య ఏర్పడిన బాండింగ్ చాలా ప్రత్యేకమైనదని గుర్తు చేసుకుంది.



# 2027 వరల్డ్ కప్ రోకో ఆడాలి

భారత సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీల వన్డే భవిష్యత్తుపై టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశాడు. 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో ఉంచుకుని జట్టును సిద్ధం చేస్తున్న నేపథ్యంలో, వారిద్దరి విషయంలో మరింత స్పష్టత అవసరమని అభిప్రాయపడ్డాడు.

**ప్రస్తుతం రోహిత్, కోహ్లీ టెస్టులు, టీ20 ఫార్మాట్లకు దూరంగా ఉంటున్నా, 50 ఓవర్ల జట్టులో కొనసాగుతున్నారు. ఓ క్రీడా ఛానెల్‌తో మాట్లాడుతూ, "వారి మనసులో ఏముందో నాకు తెలియదు. వరల్డ్ కప్ ఆడాలని వారు ఆసక్తిగా ఉన్నట్లు కనిపిస్తున్నారు. అయితే తుది నిర్ణయం సెలక్టర్లదే" అని యువరాజ్ చెప్పాడు.**





ఆటగాళ్లతో మేనేజ్ మెంట్ కూర్చుని బహిరంగంగా చర్చించాలని, ఇలాంటి సంభాషణలు కష్టమైనప్పటికీ జట్టు భవిష్యత్తుకు అవసరమని సూచించాడు. "భారత క్రికెట్‌లో ముఖం మీదే నిజం చెప్పే సంస్కృతి లేదు. కానీ ఏడాది తర్వాతైనా, నిజం చెప్పినందుకు ఆటగాళ్లు సంతోషిస్తారు" అని యువీ పేర్కొన్నాడు. ప్రస్తుతం కోహ్లీ అద్భుతమైన ఫామ్‌తో ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో రెండో స్థానానికి చేరగా, రోహిత్ కూడా జట్టులో కీలక పాత్ర పోషిస్తున్నాడు. దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా ఆతిథ్యమివ్వనున్న 2027 ప్రపంచకప్ కోసం భారత జట్టు సన్నాహాలు మొదలుపెట్టిన తరుణంలో యువరాజ్ వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## అది ధోని తలరాత

ఐపీఎల్ 2026 సీజన్ ప్రారంభానికి రెగ్యులర్ కెప్టెన్ ప్యాట్ కమిన్స్ అందుబాటులో లేకపోవడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్) జట్టు తాత్కాలిక కెప్టెన్‌గా ఇషాన్ కిషన్‌ను నియమించింది. ఈ నిర్ణయం క్రీడా వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది. చాలాకాలంగా జట్టుతో కొనసాగుతున్న యువ ఆల్‌రౌండర్ అభిషేక్ శర్మకు నాయకత్వ బాధ్యతలు అప్పగిస్తారని అందరూ భావించినప్పటికీ, ఫ్రాంచైజీ యాజమాన్యం ఇషాన్ వైపు మొగ్గు చూపింది. ఈ నిర్ణయం పట్ల టీమిండియా మాజీ దిగ్గజం యువరాజ్ సింగ్ తన అసంతృప్తిని, నిరాశను బహిరంగంగా వ్యక్తం చేశాడు. అభిషేక్ శర్మకు కొన్నేళ్లుగా నెట్స్‌లో శిక్షణ ఇస్తున్న యువరాజ్ సింగ్, అతడిని కెప్టెన్‌గా ఎంపిక చేయకపోవడం సరైంది కాదన్నాడు. స్పోర్ట్స్ తక్‌తో యువీ మాట్లాడుతూ... "ఈ నిర్ణయం నన్ను కాస్త నిరాశపరిచింది. ఇషాన్ కిషన్ ఎదుగుదల అంటే నాకూ ఇష్టమే. కానీ, ఒక ఆటగాడి కోణంలో ఆలోచించండి. అభిషేక్ శర్మ ఏడేళ్లుగా ఒకే ఫ్రాంచైజీకి తన సర్వస్వాన్ని అందిస్తున్నాడు. తన రాష్ట్ర జట్టుకు కెప్టెన్‌గా ఉంటూ, ఆ జట్టును గెలిపించాడు. అలాంటి ఆటగాడికి నాయకత్వ బాధ్యతలు ఇవ్వకపోతే, అతను ఎలాంటి మానసిక స్థితితో ఆడతాడు?" అని యువరాజ్ ప్రశ్నించాడు. అయితే, ఇషాన్, అభిషేక్ మధ్య మంచి స్నేహం ఉండటం ఈ ఎదురుదెబ్బ నుంచి కోలుకోవడానికి సహాయపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా యువరాజ్ తన కెరీర్‌లోని ఒక సంఘటనను గుర్తుచేసుకున్నారు. '2007లో భారత జట్టులో నేను వైస్-కెప్టెన్‌గా ఉన్నాను. సెహ్వాగ్, హర్భజన్ సింగ్ వంటి సీనియర్లు ఉన్నారు. కానీ, ఎక్కడి నుంచో వచ్చి ఎంఎస్ ధోనీ కెప్టెన్ అయ్యాడు. దానికి కారణాలు ఏవైనా కావచ్చు. కొందరి తలరాతలో నాయకుడిగా ఎదగాలని రాసిపెట్టి ఉంటుంది. కానీ, ఏళ్ల తరబడి జట్టు కోసం కష్టపడిన వారికి అవకాశం రానప్పుడు ఆటగాడిగా నిరాశ కలగడం సహజం' అని వివరించాడు. ఫ్రాంచైజీ నిర్ణయంతో తాను ఏకీభవించలేనని, అయితే ఇప్పుడు నిర్ణయం జరిగిపోయిందని యువరాజ్ అన్నాడు. 'రేపు హైదరాబాద్ గెలిస్తే నా మాటలు తప్పని నిరూపితం కావచ్చు. కానీ, నా అభిప్రాయం ప్రకారం వారి బౌలింగ్ చాలా బలహీనంగా ఉంది. నాయకుడిగా ఎదిగేందుకు ఐపీఎల్ గొప్ప వేదిక. అభిషేక్‌కు ఆ అవకాశం ఇచ్చి ఉండాల్సింది. ఏదేమైనా ఈ నిరాశను పక్కనపెట్టి, కెప్టెన్‌కు మద్దతు ఇస్తూ, జరిగిన అవమానాన్ని స్ఫూర్తిగా తీసుకుని మరింత కష్టపడి ఆడాలని అభిషేక్‌కు చెప్పాను' అని యువీ చెప్పుకొచ్చాడు.



## ఓడితేనేం.. ప్రపంచం అంతమైందా?: రహానే

ఐపీఎల్ 2026లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన మ్యాచ్‌లో ఘోర ఓటమి తర్వాత, కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్) కెప్టెన్ అజింక్య రహానే జట్టు సభ్యులలో స్ఫూర్తి నింపే ప్రయత్నం చేశాడు. వరుసగా రెండు మ్యాచ్‌లు ఓడిపోయినంత మాత్రాన ప్రపంచం ఏమీ అంతం కాదని, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని ఆటగాళ్లకు ధైర్యం చెప్పాడు. గురువారం ఈడెన్ గార్డెన్స్‌లో జరిగిన మ్యాచ్‌లో కేకేఆర్ 65 పరుగుల భారీ తేడాతో ఓటమి పాలైంది. మ్యాచ్ అనంతరం డ్రెస్సింగ్ రూమ్‌లో ఆటగాళ్లను ఉద్దేశించి రహానే మాట్లాడాడు. ఈ గేమ్‌లో ఎన్నో సానుకూల అంశాలు ఉన్నాయని, ముఖ్యంగా పది ఓవర్ల తర్వాత బౌలర్లు అద్భుతంగా పుంజుకుని సన్‌రైజర్స్ బ్యాటర్లను కట్టడి చేసిన తీరు అద్భుతమని ప్రశంసించాడు. కేకేఆర్ తన అధికారిక ఎక్స్ ఖాతాలో విడుదల చేసిన వీడియోలో రహానే ఈ వ్యాఖ్యలు చేశాడు. "డ్రెస్సింగ్ రూమ్‌లో మనం ప్రతిరోజూ ఏం ఆలోచిస్తామనేదే నాకు ముఖ్యం. మన ఆటగాళ్ల ప్రయత్నం ప్రశంసనీయం. మీలో ప్రతి ఒక్కరూ మ్యాచ్ విన్నర్లే. ఏ పరిస్థితిలోనైనా జట్టును గెలిపించగల సత్తా మీకుంది. ఆ నమ్మకాన్ని కోల్పోవద్దు" అని రహానే పేర్కొన్నాడు. భారీ లక్ష్య ఛేదనలో తొలి బంతి నుంచే బ్యాటర్లు చూపిన పోరాట పటిమను కూడా కెప్టెన్ మెచ్చుకున్నాడు. "ప్రపంచం మన గురించి ఏమనుకున్నా పట్టించుకోవద్దు. మనపై మనకు నమ్మకం ఉంటే చాలు" అని రహానే స్పష్టం చేశాడు. కాగా, కేకేఆర్ చరిత్రలో ఒక సీజన్‌ను వరుసగా రెండు ఓటములతో ప్రారంభించడం ఇది కేవలం రెండోసారి మాత్రమే. కేకేఆర్ తన తర్వాతి మ్యాచ్‌లను ఏప్రిల్ 6న పంజాబ్ కింగ్స్‌తో, ఏప్రిల్ 9న లక్నో సూపర్ జెయింట్స్‌తో ఆడనుంది.

## గోయెంకా తీరు సిగ్గుచేటు: లలిత్ మోదీ

లక్నో సూపర్ జెయింట్స్ (ఎల్ఎస్‌జీ) ఓనర్ సంజీవ్ గోయెంకా తీరు మరోసారి వివాదాస్పదంగా మారింది. ఐపీఎల్ 2026 సీజన్ తొలి మ్యాచ్‌లో జట్టు ఓటమి తర్వాత కెప్టెన్ రిషభ్ పంత్‌తో ఆయన జరిపిన సంభాషణకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆయనపై పెద్ద ఎత్తున విమర్శలు



వెల్లువెత్తుతున్నాయి. ఈ ఘటనపై ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ తీవ్రంగా స్పందిస్తూ, గోయెంకాను బ్యాన్ చేయాలని, ఫ్రాంచైజీ యాజమాన్యాన్ని తొలగించాలని డిమాండ్ చేయడం సంచలనం రేపుతోంది. వివరాల్లోకి వెళితే... ఐపీఎల్ 2026లో భాగంగా ఢిల్లీతో జరిగిన తొలి మ్యాచ్‌లో లక్నో ఓటమి పాలైంది. మ్యాచ్ ముగిసిన తర్వాత మైదానంలో గోయెంకా, కెప్టెన్ రిషభ్ పంత్, కోచ్ జస్టిన్ లాంగర్‌తో సీరియస్‌గా చర్చిస్తున్న దృశ్యాలు నెట్టింట వైరల్ అయ్యాయి. ఇది చూసిన నెటిజన్లు, క్రికెట్ అభిమానులు గోయెంకా ప్రవర్తనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కేఎల్ రాహుల్ విషయంలోనూ ఇలాగే ప్రవర్తించిన ఆయన, తన తీరు మార్చుకోలేదని విమర్శించారు. ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ మైఖేల్ వాన్ కూడా స్పందిస్తూ, టోర్నమెంట్ ఆరంభంలోనే ఇలా ప్రవర్తించడం సరికాదని హితవు పలికారు. ఈ వివాదంపై ఐపీఎల్ మాజీ ఛైర్మన్ లలిత్ మోదీ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఘాటుగా స్పందించారు. "ఈ వ్యక్తి ప్రవర్తన చూసి నాకు చాలా సిగ్గుగా ఉంది. నేను గనుక ఐపీఎల్ ఛైర్మన్‌గా ఉండుంటే, అతడిని వెంటనే బ్యాన్ చేసి, జట్టు యాజమాన్యాన్ని రద్దు చేసేవాడిని. ఫ్రాంచైజీ ఒప్పందంలో ఇందుకు సంబంధించిన క్లాజ్ కూడా ఉంది. బీసీసీఐ వెంటనే చర్యలు తీసుకోవాలి" అని ఆయన పోస్ట్ చేశారు. లలిత్ మోదీ వ్యాఖ్యలతో ఈ వివాదం మరింత పెద్దదిగా మారింది. కాగా, 2024 సీజన్‌లోనూ అప్పటి కెప్టెన్ కేఎల్ రాహుల్‌తో గోయెంకా ఇలాగే మైదానంలో ప్రవర్తించడం పెను దుమారం రేపింది. ఈ సీజన్ ఆరంభానికి ముందు తాను మారుతున్నట్లు చెప్పినప్పటికీ, తొలి మ్యాచ్ ఓటమి తర్వాత మళ్లీ అదే తరహాలో ప్రవర్తించడం విమర్శలకు తావిచ్చింది. అయితే, సోషల్ మీడియాలో విమర్శలు వెల్లువెత్తడంతో లక్నో సూపర్ జెయింట్స్ యాజమాన్యం దీనిపై స్పందించింది. బయట ప్రచారం జరుగుతున్నట్లుగా అక్కడ సీరియస్ చర్చ ఏమీ జరగలేదని, అదొక సాధారణ సంభాషణ మాత్రమేనని పేర్కొంటూ ఒక వీడియోను తమ అధికారిక ఖాతాలో పోస్ట్ చేసింది. యాజమాన్యం వివరణ ఇచ్చినప్పటికీ, గోయెంకా ప్రవర్తనపై విమర్శలు మాత్రం ఆగడం లేదు.

## సంజూ నిజమైన ఆటగాడు: మోదీ

టీమిండియా స్టార్ బ్యాటర్, కేరళ ఆటగాడు సంజూ శాంసన్‌పై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. ఇటీవల ముగిసిన టీ20 ప్రపంచకప్‌లో శాంసన్ కనబరిచిన అద్భుతమైన ఆటతీరును ఆయన కొనియాడారు. కేరళ కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడిన ప్రధాని, కీలకమైన నాకౌట్ మ్యాచ్‌లలో శాంసన్ చూపిన ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం, పట్టుదల అమోఘమని అన్నారు. జట్టుకు అవసరమైనప్పుడు అత్యుత్తమ ప్రదర్శన చేసేవాడే నిజమైన ఆటగాడని ఆయన అభివర్ణించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ మాట్లాడుతూ... "ప్రస్తుతం క్రికెట్ సీజన్ నడుస్తోంది. కేరళ ప్రజలు కూడా సంజూ శాంసన్ ప్రదర్శన నుంచి నేర్చుకోవాలి. ప్రపంచకప్‌లో శాంసన్ ఆటతీరును మనం చూశాం. టోర్నమెంట్‌లో కీలకమైన నాకౌట్ దశ వచ్చినప్పుడు, అతని ప్రదర్శన అకస్మాత్తుగా శిఖర స్థాయికి చేరింది. టోర్నీ ఆరంభం నుంచి ముగింపు వరకు అతని ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతూనే ఉన్నాయి. జట్టుకు అతని అవసరం అత్యంత ఎక్కువగా ఉన్నప్పుడు, అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చాడు. ఇదే నిజమైన ఆటగాడికి ఉండాల్సిన లక్షణం" అని తెలిపారు. 2026 టీ20 ప్రపంచకప్‌లో భారత్ విజేతగా నిలవడంలో సంజూ శాంసన్ కీలక పాత్ర పోషించాడు. ఈ టోర్నీలో మొత్తం 5 ఇన్నింగ్స్‌లలో 80.25 సగటు, 199.37 స్ట్రైక్ రేట్‌తో 321 పరుగులు సాధించి "ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్" అవార్డును గెలుచుకున్నాడు. ఇందులో 27 ఫోర్లు, 24 సిక్సులు ఉన్నాయి. ఈ ప్రదర్శనతో ఒకే టీ20 ప్రపంచకప్ ఎడిషన్‌లో అత్యధిక పరుగులు చేసిన భారత ఆటగాడిగా విరాట్ కోహ్లీ (2014లో 319 పరుగులు) రికార్డును శాంసన్ అధిగమించాడు. టోర్నీ ఆరంభంలో రెండు మ్యాచ్‌లలో పెద్దగా రాణించకపోయినా, సూపర్-8 దశ నుంచి శాంసన్ చెలరేగిపోయాడు. వెస్టిండీస్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో అజేయంగా 97 పరుగులు చేసి జట్టును గెలిపించాడు. ఆ తర్వాత సెమీఫైనల్‌లో ఇంగ్లండ్‌పై 89, ఫైనల్‌లో న్యూజిలాండ్‌పై మరో 89 పరుగులతో జట్టు విజయంలో ముఖ్య భూమిక పోషించాడు.







## చెన్నైలో చెన్నై చిత్తుగా..!

### మళ్లీ ఓడిన సీఎస్కే.. అదరగొట్టిన పంజాబ్.. శ్రేయస్ కెప్టెన్ ఇన్నింగ్స్


ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ మరోసారి అదరగొట్టింది. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్‌పై 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. చెన్నై నిర్దేశించిన 210 పరుగుల భారీ లక్ష్యాన్ని పంజాబ్ కింగ్స్ కేవలం 18.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (50; 29 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్సర్లు) బాధ్యతాయుతమైన హాఫ్ సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మిగిలిన బ్యాటర్లు కూడా రాణించడంతో పంజాబ్‌కు సునాయాస విజయం దక్కింది. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న పంజాబ్ కింగ్స్‌కు చెన్నై బ్యాటర్లు చుక్కలు చూపించారు. ముఖ్యంగా యువ ఆటగాడు అయూష్ మాత్రే (73; 43 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్సర్లు) అద్భుత ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. అతనికి తోడుగా శివమ్ దూబే (45 నాటౌట్; 27 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్సర్), సర్ఫరాజ్ ఖాన్ (32; 12 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్సర్) మెరుపులు మెరిపించడంతో చెన్నై నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 209 పరుగుల భారీ స్కోరు సాధించింది. పంజాబ్ బౌలర్లలో విజయ్‌కుమార్ వైశ్యాఖ్ రెండు వికెట్లు తీయగా, బార్ట్‌లెట్, జాన్సెన్, చాహల్ తలో వికెట్ పడగొట్టారు. భారీ లక్ష్య ఛేదనలో పంజాబ్ కింగ్స్ ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించింది. ఓపెనర్ ప్రియాన్ష్ ఆర్య కేవలం 11 బంతుల్లో 3 ఫోర్లు, 4 సిక్సర్లతో 39 పరుగులు చేసి మెరుపు ఆరంభాన్నిచ్చాడు. అతని ధాటికి పంజాబ్ పవర్‌ప్లేలోనే 68 పరుగులు రాబట్టింది. అనంతరం ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (43), కూపర్ కనోలీ (36) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ బాధ్యతాయుతమైన అర్ధశతకంతో జట్టును విజయానికి చేరువ చేశాడు. చివర్లో శశాంక్ సింగ్ (14 నాటౌట్), మార్కస్ స్టోయినిస్ (9 నాటౌట్ ) లాంఛనాన్ని పూర్తి చేయడంతో పంజాబ్ మరో 8 బంతులు మిగిలి ఉండగానే లక్ష్యాన్ని అందుకుంది. చెన్నై బౌలర్లలో మ్యాట్ హెన్రీ, అన్షుల్ కంబోజ్ రెండేసి వికెట్లు తీసినా, ధారాళంగా పరుగులు సమర్పించుకోవడంతో చెన్నైకి ఓటమి తప్పలేదు. సొంతగడ్డపై భారీ స్కోరు చేసినప్పటికీ బౌలర్ల వైఫల్యంతో చెన్నైకి నిరాశే ఎదురైంది. కాగా, చెన్నై జట్టుకు ఇది వరుసగా రెండో ఓటమి. గువాహటిలో జరిగిన తొలి మ్యాచ్ లో రాజస్థాన్ రాయల్స్ చేతిలో ఓడిపోయిన సీఎస్కే... ఇవాళ సొంతగడ్డపై జరిగిన మ్యాచ్ లోనూ పరాజయం చవిచూసింది.

ఈవార్తలు
# ప్రజావాణి
శనివారం 04-4-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు

నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# యువ నేతలకు అడ్డుగోడలు

భారత రాజకీయ యవనికపై కొత్త రక్తం ఉరకలేస్తోంది. చదువుకున్న వారు, కార్పొరేట్ రంగాన్ని వదిలి వచ్చిన వారు, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న యువత రాజకీయాల వైపు అడుగులు వేయడం ఆహ్వానించదగ్గ పరిణామం. అయితే, పార్టీలో ఒక స్థాయికి చేరుకున్నాక, ఆ యువ నేతలకు పార్టీల లోపలే 'కళ్లెం' వేయడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ముఖ్యంగా తమిళనాడులో బీజేపీ బాధ్యతలు మోస్తున్న కే అన్నామలై, ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్)లో కీలక పాత్ర పోషిస్తున్న రాఘవ్ చద్దా వంటి వారి ఎదుగుదల, వారు ఎదుర్కొంటున్న అంతర్గత ఇబ్బందులు దీనికి అద్దం పడుతున్నాయి. తమిళనాడులో ద్రవిడ రాజకీయాల మధ్య బీజేపీకి ఒక గుర్తింపు తెచ్చిన ఘనత అన్నామలైది. మాజీ ఐపీఎస్ అధికారిగా ఆయన చూపిన దూకుడు యువతను ఆకట్టుకుంది. అయితే, సొంత పార్టీలోని సీనియర్ నేతలతో ఆయనకు పొసగకపోవడం, పొత్తుల విషయంలో ఆయన తీసుకునే నిర్ణయాలపై అధిష్టానం కన్నెర్ర చేయడం వంటివి ఆయన అడుగులకు కళ్లెం వేసింది. ఆయన పాదయాత్రలు, వాక్చాతుర్యం పార్టీకి బలాన్నిచ్చినా, ఆయన ఎదుగుదల పార్టీలోని పాత తరం నేతలకు మింగుడుపడలేదనేది బహిరంగ రహస్యం. ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భావం నుంచి అరవింద్ కేజ్రీవాల్‌కు నమ్మకస్తుడిగా, పార్టీ జాతీయ విస్తరణలో కీలక పాత్రధారిగా రాఘవ్ చద్దా ఎదిగారు. పంజాబ్ విజయంలో ఆయన వ్యూహాలు అద్భుతంగా పనిచేశాయి. కానీ, గత కొంతకాలంగా పార్టీ అంతర్గత వ్యవహారాల్లో ఆయన ప్రాధాన్యం, ఉన్నఫలంగా ఆయనను రాజ్యసభ ఆప్ డిప్యూటీ లీడర్‌గా తప్పించడం వంటి చర్యలు పార్టీకి మంచివి కావు. రాఘవ్ చద్దా విదేశాల్లో ఉండటం లేదా చట్టపరమైన చిక్కుల పేరుతో ఆయన్ను కొన్నాళ్లు పక్కన పెట్టడం వెనుక 'అతిగా ఎదుగుతున్నారనే' ఆందోళన ఉందా అన్న అంటే అవునన్న అనుమానం కలుగుతోంది. పార్టీలు ప్రజాస్వామ్యబద్ధంగా నడుస్తున్నాయని చెప్పుకున్నా, పగ్గాలు మాత్రం కొద్దిమంది చేతుల్లోనే ఉండాలని అధిష్టానాలు కోరుకుంటాయి. యువ నేతలు సొంతంగా ఇమేజ్ పెంచుకుంటే, అది పార్టీలోని వారసులకు లేదా సీనియర్ల ప్రాబల్యానికి ముప్పుగా మారుతుందని భావిస్తారు. యువత వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని చూస్తారు. ఇది పాత తరం నేతలకు ఆందోళన కలిగిస్తుంది. అందుకే అడ్డుకట్ట వేస్తున్నారా? యువ నేతలను ప్రోత్సహించకపోతే పార్టీలు కాలక్రమేణా చుక్కాని లేని నావలుగా మారుతాయి. అన్నామలై, రాఘవ్ చద్దా వంటి వారు కేవలం వ్యక్తులు కాదు, మారుతున్న రాజకీయాలకు చిహ్నాలు. వారి రెక్కలు విరవాలని చూడటం అంటే పార్టీ భవిష్యత్తును అంధకారం చేసుకోవడమే. అగ్ర నాయకత్వం తమ పట్టు కోసం యువతకు కళ్లెం వేయడం మానుకొని, వారిని భావి నాయకులుగా తీర్చిదిద్దినప్పుడే నిజమైన ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది.



## రాళ్లే కదాని చిన్నచూపేల..?

ఓ మిత్రమా..!రాళ్లే కదాని
చిన్నచూపు చూడకు ...

కాలం చెక్కితే రేపు
అవే కళాఖండాలౌతాయి
గర్భగుడిలో మనం మొక్కే
సుందర దేవతా శిల్పాలౌతాయి

ఓ మిత్రమా..!రాళ్లే కదాని
చిన్న చూపు చూడకు...

ఈ రత్నాల వజ్రాల గీతాలు
ఈ మణిమాణిక్యాల మెరుపులు
నిద్రించేది భూగర్భంలోనే కదా

ఓ మిత్రమా..! చిన్నరాయే కదాని
చిలిపిగా విసరకు... అది
నిశ్చల జలంలో పడినా
అందమైన అద్దంపై పడినా
నీ ప్రతిబింబమే ఛిద్రమై
నిన్ను నీవే కోల్పోతావు...!

ఓ మిత్రమా..! చిన్నరాయే కదాని
ఆకాశం వైపు విసిరకు అది
తిరిగి పడి పగిలేది నీ తలనే కదా..!

ఓ మిత్రమా..!
అద్దాల మేడలో నివసిస్తూ
రాళ్లు విసరడం మానుకో...
అవి శత్రువుకి తగలకముందే
పగిలి ముక్కలయ్యేది
నీ అందమైన అద్దాల మేడే..కదా

అందుకే మిత్రమా...
రాతిగుండెల రాక్షసుడివై ఎన్ని
రంగురాళ్లు ధరించి లాభమేమి..?

వెన్నలా కరిగే కరుణతో
పూలలా పరిమళించే ప్రేమతో
మనసున్న మనిషిగా జీవించు...
మంచితనం మానవత్వమే
మనిషికి ఆభరణమని మరువకు..



పోలయ్య కూకట్లపల్లి




# నాటో.. అమెరికాకు నో!

**ఏప్రిల్ 4, 1949.. నాటో (ఉత్తర అట్లాంటిక్ సంధి వ్యవస్థ) ఏర్పడిన రోజు. సరిగ్గా 77 ఏళ్లు పూర్తయ్యాయి. అమెరికాలోని వాషింగ్టన్‌లో 12 వ్యవస్థాపక దేశాల సంతకాలతో ఈ శక్తివంతమైన సైనిక కూటమి ఆవిర్భవించింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత సోవియట్ యూనియన్ విస్తరణను అడ్డుకోవడమే లక్ష్యంగా నాటో ఏర్పడింది. అయితే, నేడు పరిస్థితి ఒక్కసారిగా తలకిందులుగా మారింది.**

ఇరాన్ యుద్ధం విషయంలో అమెరికాకు, దాని నాటో మిత్రదేశాలకు మధ్య తీవ్ర భేదాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ చేపట్టిన దాడులకు నాటో మిత్రదేశాల నుంచి ఆశించిన మద్దతు లభించడం లేదు. ముఖ్యంగా ఫ్రాన్స్, జర్మనీ వంటి దేశాలు ఈ యుద్ధానికి దూరంగా ఉంటున్నాయి. ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ వంటి కీలక దేశాలు ఇరాన్‌పై దాడుల్లో పాల్గొనడానికి ఖరాఖండిగా లేదు అని చెప్పేశాయి. 'మేము ఈ యుద్ధాన్ని ప్రారంభించలేదు, ఇది మా యుద్ధం కాదు' అని జర్మనీ రక్షణ మంత్రి బహిరంగంగానే వ్యాఖ్యానించారు. అమెరికా యుద్ధ విమానాలకు స్పెయిన్ తన గగనతలాన్ని మూసివేసి గట్టి షాక్ ఇచ్చింది. ఇటలీ కూడా తన సైనిక స్థావరాలను ఉపయోగించుకోవడానికి నిరాకరించింది. నాటో నిబంధనల ప్రకారం, ఒక సభ్యదేశంపై దాడి జరిగితేనే అందరూ స్పందించాలి. కానీ ఇరాన్ విషయంలో అమెరికా స్వయంగా దాడులు ప్రారంభించడం వల్ల, ఇది తమకు వర్తించదని యూరప్ దేశాలు వాదిస్తున్నాయి. మద్దతు ఇవ్వని దేశాలను డొనాల్డ్ ట్రంప్ తీవ్రంగా విమర్శిస్తున్నారు. నాటోను ఒక పేపర్ టైగర్ (కాగితపు పులి) గా అభివర్ణిస్తూ, ఈ కూటమి నుంచి అమెరికా వైదొలిగే అవకాశం ఉందని హెచ్చరించారు. నాటో తన సభ్య దేశమైన టర్కీని ఇరాన్ క్షిపణి దాడుల నుంచి కాపాడటానికి రక్షణ వ్యవస్థలను వినియోగిస్తోంది. అయితే, ఇరాన్ లోపల అమెరికా చేసే దాడుల్లో నేరుగా పాల్గొనడానికి ఇతర సభ్య దేశాలు విముఖత చూపుతున్నాయి. అయితే, నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే అమెరికా దాడులను సమర్థిస్తూనే, కూటమిని యుద్ధంలోకి లాగకుండా జాగ్రత్తపడుతున్నారు. ప్రస్తుతం నాటో, చరిత్రలో ఎన్నడూ లేని విధంగా నేడు అంతర్గత విభేదాలను ఎదుర్కొంటోంది. ఇరాన్ సంక్షోభం ఒక యుద్ధం మాత్రమే కాకుండా, అట్లాంటిక్ దేశాల మధ్య దశాబ్దాల నాటి బంధానికి పరీక్షగా నిలుస్తోంది. ఒకవైపు రష్యా-ఉక్రెయిన్ ముప్పు, మరోవైపు ఇరాన్ సంక్షోభం నాటోను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. యూరప్ దేశాలు అమెరికాపై ఆధారపడకుండా తమకంటూ ప్రత్యేక సైనిక కూటమిని ఏర్పాటు చేసుకునే దిశగా అడుగులు వేయడం, నాటో భవిష్యత్తును ప్రశ్నార్థకం చేస్తోంది. 77 ఏళ్ల విజయ ప్రస్థానంలో ఎన్నో విజయాలు సాధించిన నాటో, నేడు ఇరాన్ యుద్ధం సాక్షిగా ఒకటిగా కలిసి పోరాడదామా? లేక విడిపోదామా? అనే చారిత్రక సందిగ్ధంలో పడింది.



రణధీర్ గుండు

## ఒంటరవుతున్న ఉమ్మడితనం..!!



జీవితాంతం మోయాల్సిన మూడుముళ్ళ బరువు బాధ్యతలు ముళ్ళకంచై..
తెంచుకోవడానికి వీల్లేని బంధనాలిప్పుడు
కెరీర్లో ఎక్కి దిగాల్సిన ఎత్తు పల్లాల దగ్గర చతికిలపడుతున్నాయి

పేనిన పసుపుతాడు తాళిబొట్టు, కాలిమెట్టెలు నాలుగుగోడల నడుమ నలిగిపోతూ
అభద్రతతోనూ, అనుమానంతోనూ కాళ్ళకు కట్టే తాళ్ళని వదిలించుకోవాలని
ఒత్తిళ్ళూ, నియంత్రణలూ భరించలేక కంచెల్ని కాపురాల్ని కూల్చుకొని
గమ్యం లేని ప్రయాణాల్ని కోరుకుంటున్నాయి

అంతర్జాల పరిచయాలు, కోలివిన్ లు, క్వాంటం డేటింగ్ లలో
కట్టుబడని వాగ్దానాలు.. పవిత్రత కోల్పోయి జరుగుతున్న ప్రేమలేని పెళ్ళిళ్ళు

అహాల ముసుగులో విలువ తగ్గిన బంధమిప్పుడు
ముల్లులాంటి చూపులతో గాయపర్చుకుంటూ
దానికి కారణం నువ్వేనని పొర్లి పొర్లి ఏడ్చి జీవితాల్ని కోల్పోతున్నాయి

దశాబ్దాలుగా కలిసే ఉంటున్నా పాతబడని దీర్ఘకాలబంధాలూ
అప్డేడ్ అయి దగ్గరగా ఉన్నా దూరంతనాన్ని అనుభవించే షష్టిపూర్తి పెద్దరికాలిప్పుడు
"గ్రే డైవోర్సంటూ"విడిపోయి ఆలుమగల అనుబంధాలంటే
తిన్నంత సేపు అరిటాకు-తిన్నాక ఎంగిలాకుగా నిర్ణయాల్ని మార్చుకుంటున్నాయి

నిన్నటివరకు ఒకరిలో ఒకరైన సగభాగాలిప్పుడు
సిలికాన్ శిఖరాల ప్యాకేజీ ప్రమాణాలు గీసిన గీతల్లో దారులు విడిపోయి
కమ్ముకున్న సైబర్ స్పేస్ సరిహద్దుల కావల
మిగిలిపోతున్న శత్రు దేహాలవుతున్నాయి!

భార్యాభర్తలంటే బానిస యజమాని సంబంధాలంటున్న డాలరికపు దాష్టీకంలో
'మాంగల్యంతంతునానేనా' ఒక తంతై
ఏ బంధానికి లొంగని అపరిమిత స్వేచ్ఛ ఖండాంతరాలలో విస్తరిస్తూ
విడివడితే ఎవర్ న్యూ సుఖమన్న ఒంటరి కుంపటైయింది

ఏ కేరింగూ షేరింగూ లేని బంధమిపుడు కోర్టు మెట్లెక్కుతుంటే
నెత్తిన జల్లుకోవడానికి పనికిరాని వేదమంత్రాల తలంబ్రాలు
కలిసుంటే ఎడతెగని దుఃఖమన్న బ్రహ్మముడి మీద
కన్నీటి కల్లాపి చల్లి నెత్తురు ముగ్గు పెడ్తున్నవి

ఇక నీదారి నీదే నా దారి నాదే నంటూ
పట్టించుకోవట్లేదన్న విడాకుల పత్రాలు
బండెడు దాణా మేసి బుట్టెడు పేడేసే గొడ్డుగోవు సంస్కృతి
పెరట్లో పేరుకుపోయి కంపుకొడుతున్న చెత్త కుప్పలా
ఆలుమగల అన్యోన్యత అంటే
అనుబంధాల తాడు తెగిపోయి నేడు ఇంటింటా ఒంటరవుతున్న ఉమ్మడితనమే!!



బీ కళాగోపాల్
నిజామాబాద్

**రచయితలకు ఆహ్వానం!**

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.